# వేకువ సమయం

సంపుటి: 14 సంచిక: 216

VEKUVA SAMAYAM TELUGU DAILY

* Mahabubnagar * Hyderabad * Miryalaguda & Rangareddy సంపాదకులు : కె.భాస్కర్‌రావు రూ.2.00/- పేజీలు 8 తేది: మంగళవారం 08 సెప్టెంబర్ 2026








**సమయం ప్రతినిధి:** స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని టీడీపీ నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. టీడీపీ లీడర్‌షిప్ కాంక్లేవ్‌లో స్థానిక సంస్థల ఎన్నికలపై ఆయన ప్రత్యేకంగా చర్చించారు. ఎన్నికలను తేలిగ్గా తీసుకోవద్దన్నారు. కూటమిగా సఖ్యతగా ఉండాలని, పార్టీలోని నేతల మధ్య ఎలాంటి గ్యాప్‌లు ఉండకూడదని సూచించారు. మహిళా రిజర్వేషన్లలో పోటీ చేసే అభ్యర్థుల విషయంలో సమర్థవంతమైన మహిళా నేతలను ముందుగానే గుర్తించాలని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చాలా సమస్యలను పరిష్కరించామని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రభుత్వంపై ప్రజల్లో సానుకూలత ఉందని, ఆ సానుకూలత స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిఫలించాలని ఆకాంక్షించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు సాధించడంపైనే తన ధ్యాస, ఆలోచన అంతా ఉందని స్పష్టం చేశారు. 2029 అసెంబ్లీ ఎన్నికల్లో 2024 ఎన్నికల కంటే మెరుగైన ఫలితాలు సాధిస్తామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. పరిపాలనతో పాటు పార్టీకి కూడా ప్రతిరోజూ సమయం కేటాయిస్తున్నానని తెలిపారు.

**ఎమ్మెల్యేలకు టార్గెట్లు :** ప్రాధాన్యతా క్రమంలో ప్రాజెక్టులను పూర్తి చేస్తూ అభివృద్ధి పనులు చేపడుతున్నామని చంద్రబాబు తెలిపారు. టార్గెట్లు పెట్టుకుని పెట్టుబడులు తీసుకురావడంతో పాటు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేలు కూడా తమ నియోజకవర్గాల్లో స్పష్టమైన లక్ష్యాలతో పనిచేయాలని సూచించారు.




**సమయం ప్రతినిధి:** రాజకీయ ప్రయోజనాల కోసం మహిళలపై ఎలాంటి నిందాపూర్వక, అసభ్యకరమైన వ్యాఖ్యలు చేయడాన్ని సహించేది లేదని తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ స్పష్టం చేశారు. ఇటీవల నటి త్రిషను ఉద్దేశించి ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ అనుచిత వ్యాఖ్యలు చేశారనే వివాదం చెలరేగిన నేపథ్యంలో, విజయ్ శాసనసభలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో కఠినమైన విమర్శలు చేసుకోవడం సహజమేనని, అయితే భావ ప్రకటనా స్వేచ్ఛ పేరిట మహిళలను కించపరిచేలా మాట్లాడటం సరికాదని సీఎం పేర్కొన్నారు.

**మహిళల గౌరవమే ప్రాధాన్యం:** తన సినీ కెరీర్‌లోనూ, ప్రస్తుతం రాజకీయంగా ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించడంలోనూ మహిళల పాత్ర కీలకమైనదని విజయ్ గుర్తుచేశారు. ఇంట్లో తల్లులు, సోదరీమణులను ఏ విధంగా గౌరవిస్తామో, బయట కూడా అదే గౌరవాన్ని కొనసాగించాలని కోరారు.

**డీఎంకే, ఉదయనిధి స్టాలిన్ స్పందన :** కావేరీ నిరసన సభలో ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమవ్వగా, ఆయన ఏ నటి పేరును ప్రస్తావించలేదని డీఎంకే వర్గాలు తెలిపాయి. రాజకీయంగా లబ్ధి పొందడానికే తమ వ్యాఖ్యలను ఎడిట్ చేసి, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించాయి. ఈ అంశంపై శాసనసభ సమావేశాల అనంతరం ఉదయనిధి స్టాలిన్ మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి విజయ్ డీఎంకేపై ఎలాంటి ఆధారాలు లేకుండా లేనిపోని ఆరోపణలు చేశారని విమర్శించారు.




**సమయం ప్రతినిధి:** ఏరోస్పేస్, రక్షణ రంగ తయారీ హబ్‌గా గ్లోబల్ మ్యాప్‌లో హైదరాబాద్ తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది. హైదరాబాద్‌లోని 'టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్' (TBAL) ప్లాంట్ ప్రపంచ స్థాయి మైలురాయిని అధిగమిస్తూ, విజయవంతంగా పూర్తి చేసిన 400వ AH-64E అపాచీ' (Apache) అటాక్ హెలికాప్టర్ ఫ్యూజ్‌లేజ్‌ను (హెలికాప్టర్ ప్రధాన బాడీ భాగం) ఆవిష్కరించింది. ఈ ఘనతతో రక్షణ రంగ విడిభాగాల తయారీలో హైదరాబాద్ తన స్థానాన్ని విశ్వవ్యాప్తం చేసింది.

**గ్లోబల్ సప్లై చైన్‌కు హైదరాబాద్ కేంద్రం**

జాయింట్ వెంచర్: అమెరికాకు చెందిన ప్రముఖ ఏరోస్పేస్ దిగ్గజం 'బోయింగ్', భారతీయ 'టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్' కలయికలో జాయింట్ వెంచర్‌గా ఏర్పాటైన ఈ ప్లాంట్, అంతర్జాతీయ ప్రమాణాలతో రక్షణ ఉత్పత్తులను తయారు చేస్తోంది. ప్రపంచ వ్యాప్త సరఫరా: హైదరాబాద్ ప్లాంట్ నుంచి తయారైన ఈ ఫ్యూజ్‌లేజ్‌లు కేవలం భారతదేశానికే కాకుండా అమెరికా ఆర్మీ (US Army) సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ దేశాల సైన్యాలకు ఎగుమతి అవుతున్నాయి. భారత సైన్యానికి కొండంత అండ: భారత వైమానిక దళం (IAF) వినియోగిస్తున్న 22 అపాచీ హెలికాప్టర్లతో పాటు, ఇండియన్ ఆర్మీ ఆధీనంలో ఉన్న 6 అపాచీ హెలికాప్టర్లకు హైదరాబాద్‌లో తయారైన విడిభాగాలే ప్రధాన ఆధారం కావడం గమనార్హం.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** తెలంగాణ శాసనసభలో కాంగ్రెస్ ప్రభుత్వం, నిరసనలు చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులపై పోలీసులు కిరాతకంగా వ్యవహరించారంటూ బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభను కాంగ్రెస్ ప్రభుత్వం 'దుశ్శాసన సభ'గా మార్చివేసిందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆయన పోలీస్ బృందం కిరాతకంగా వ్యవహరించాయని ఆయన ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో కాంగ్రెస్ ఎంత రెచ్చగొట్టినా ప్రజాస్వామ్యబద్ధంగానే వ్యవహరించాలని తమ అధినేత కేసీఆర్ సూచించారని కేటీఆర్ తెలిపారు. నాడు పార్లమెంట్‌లో రాహుల్ గాంధీ టీ-షర్టులు ధరించి నిరసన తెలిపిన తరహాలోనే తాము కూడా అసెంబ్లీకి వెళ్లామని స్పష్టం చేశారు. అజాతశత్రువులుగా పేరున్న మాజీ మంత్రులు, మహిళా ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డిలపై పోలీసులు ప్రవర్తించిన తీరును సమాజం నిశితంగా గమనించిందని అన్నారు. అసలు ఏ రూల్ ప్రకారం తమను అడ్డుకున్నారో చెప్పడానికి అధికారుల వద్ద సమాధానం లేదన్నారు. టీ-షర్టులపై ఎలాంటి అభ్యంతరకర పదాలు లేవని, అలా ఉన్నాయని అనడానికి డీసీపీ శిల్పవల్లి ఎవరని నిలదీశారు. రేవంత్ రెడ్డిని నిలదీస్తామనే భయంతోనే తమను అడ్డుకున్నారని, ఆ తర్వాత ఈ అంశాన్ని డైవర్ట్ చేయడానికి కొత్త నాటకాలకు తెరలేపారని ఆరోపించారు. సభలో జరిగిన గలాటాకు ఆద్యుడు ముఖ్యమంత్రేనని కేటీఆర్ విమర్శించారు. 'వలువలు విప్పుతా' అని మాట్లాడిన ముఖ్యమంత్రి ఈరోజు విలువల గురించి మాట్లాడటం, అసెంబ్లీలో బూతులు మాట్లాడే రేవంత్ రెడ్డి నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో డీ.కే. అరుణకు తాను, జగదీష్ రెడ్డి క్షమాపణలు చెప్పిన విషయాన్ని కేటీఆర్ గుర్తుచేశారు. ఇప్పుడు సభలో జరిగిన ఘటనకు రేవంత్ రెడ్డి స్పందించి క్షమాపణ చెప్పే వరకు వదిలిపెట్టేది లేదని, సభలో నిలదీస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. సర్వభ్రష్ట ప్రభుత్వంగా పేరు తెచ్చుకున్న రేవంత్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.




**హైదరాబాద్, సమయం ప్రతినిధి:** తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) ప్రక్రియకు సంబంధించి ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణకు ఉన్న గడువును పొడిగించింది. ముందుగా ఈ నెల 16 వరకు ఉన్న గడువును అక్టోబర్ 7 వరకు పొడిగించినట్లు తెలిపింది. క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ అనంతరం వాటి పరిశీలన, పరిష్కార ప్రక్రియ కొనసాగనుంది. ఈ ప్రక్రియను నవంబర్ 5లోగా పూర్తి చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం పూర్తైన తర్వాత నవంబర్ 9న తెలంగాణలో తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నారు.




**సమయం ప్రతినిధి:** ఇటీవల ఉత్తరాఖండ్‌లో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పర్యటన అనంతరం జరిగిన 'ప్యూరిఫికేషన్' ఘటనను కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీలు తీవ్రంగా ఖండించారు. ఢిల్లీలోని ఏఐసీసీ ఇందిరా భవన్‌లో జరిగిన కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీల సమావేశంలో 'ప్యూరిఫికేషన్' ఘటనపై చర్చించారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపీలు డిమాండ్ చేశారు. ఈ అంశంపై రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ కూడా కోరినట్లు చెప్పారు. వివిధ రాష్ట్రాలకు చెందిన 32 మంది కాంగ్రెస్ ఎస్సీ, ఎస్టీ ఎంపీలు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ ఎంపీల కోసం ప్రత్యేకంగా ఒక ఫోరంను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీల పట్ల బీజేపీకి చిన్నచూపు ఉందని ఆరోపించారు. ఖర్గే కార్యక్రమం అనంతరం ప్యూరిఫికేషన్ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సమావేశంలో చర్చించామని తెలిపారు. తెలంగాణలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను కూడా గడ్డం వంశీ ఖండించారు.

## పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులపై కలెక్టర్ సీరియస్



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7:** ప్రజావాణిలో ప్రజలు సమర్పించే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల మేరకు సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే సహించబోమని స్పష్టం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, రెవెన్యూ, పింఛన్లు, సంక్షేమ పథకాలు, ఉపాధి, రహదారులు, తాగునీరు, గృహ నిర్మాణం తదితర అంశాలపై తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 62 ఫిర్యాదులు స్వీకరించారు.

**రెండు రోజుల్లో పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం**

ప్రజావాణి అనంతరం పెండింగ్‌లో ఉన్న సీఎం ప్రజావాణి, జిల్లా ప్రజావాణి దరఖాస్తులపై కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా పెండింగ్ దరఖాస్తుల వివరాలను అధికారుల గ్రూపుల్లో పంపించి, వాటిపై తీసుకున్న చర్యలు, పరిష్కరించిన అంశాలు, దరఖాస్తుదారులకు అందించిన సమాచారంతో కూడిన లిచర్యల నివేదిక (ఏటీఆర్)లను తప్పనిసరిగా సమర్పించాలని ఆదేశించారు. పరిష్కరించడం సాధ్యం కాని దరఖాస్తుల విషయంలో అందుకు గల కారణాలను స్పష్టంగా నివేదికలో పేర్కొనాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న అన్ని దరఖాస్తులను రెండు రోజుల్లోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను కూడా రాతపూర్వకంగా సమర్పించాలని తెలిపారు.దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉన్నందున చిన్నచిన్న సమస్యలను కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించి వివరాలను నమోదు చేయాలని సూచించారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల మున్సిపాలిటీలతో పాటు ఇతర శాఖల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించాలని ఆదేశించారు. భూత్పూర్ మున్సిపాలిటీలో పెండింగ్ దరఖాస్తుల వివరాలను సేకరించి త్వరగా పరిష్కరించాలని సూచించారు.విద్యార్థులకు హాస్టల్ కేటాయింపులకు సంబంధించిన దరఖాస్తులను అర్హతల మేరకు పరిశీలించి పరిష్కరించాలని, అర్హత లేని సందర్భంలో కారణాలను స్పష్టంగా పేర్కొని దరఖాస్తును ముగించాలని కలెక్టర్ తెలిపారు. ఇరిగేషన్ శాఖలో క్షేత్రస్థాయి పరిశీలన అవసరమైన దరఖాస్తులను వెంటనే పరిశీలించి విచారణ నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

**పెన్షన్ సమస్యలపై ప్రత్యేక దృష్టి :** పిటిషన్ల విభాగంలో పెన్షన్ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా ఉన్నాయని, వాటిని కూడా వెంటనే పరిష్కరించి ఏటీఆర్ సమర్పించాలని అధికారులకు సూచించారు. ఎస్పీ కార్యాలయానికి సంబంధించిన ప్రజావాణి దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి సారించి అవసరమైన నివేదికలను వెంటనే సేకరించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు తమ పరిధిలోని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించి, అవసరమైన ఏటీఆర్‌లను సమర్పించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయి అధికారులు సైతం చురుగ్గా పాల్గొని పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు.

## ప్రజావాణిలో ప్రజల సమస్యలు విన్న ఎస్పీ
## ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం వద్దు



**సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7:** ప్రజల సమస్యలను నిబంధనల ప్రకారం పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను ఎస్పీకి అందజేశారు. ఫిర్యాదులను స్వయంగా స్వీకరించిన ఎస్పీ ప్రతి సమస్యను ఓపికగా విని వివరాలను తెలుసుకున్నారు. ప్రజలు అందించిన ఫిర్యాదులపై సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడిన ఎస్పీ, నిబంధనల మేరకు సమస్యలను పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకుండా బాధ్యతాయుతంగా స్పందించాలని సూచించారు. ప్రజలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని ఎస్పీ తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నిర్భయంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, ప్రజావాణి ద్వారా అందుతున్న ప్రతి ఫిర్యాదును ప్రాధాన్యతతో పరిశీలించి అర్హత మేరకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# సంపాదకీయం

## రేవంత్‌కు రెండో చాన్స్ ఉందా...

ఇల్లు అలకగానే పండుగ కాదు అన్నట్టుగా రేవంత్‌రెడ్డి పరిస్థితి ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఏర్పడుతున్న వ్యతిరేకతను పోగొట్టడానికి ఆయనకు నికరంగా ఏడాది మాత్రమే సమయం మిగిలి ఉంది. చివరి సంవత్సరంలో ఎన్ని విన్యాసాలు చేసినా ప్రజాభిప్రాయం మారదు. తాను బలపడుతూ, పార్టీ కూడా బలపడేలా చేయాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌పైన పడింది. కొండా సురేఖ ఎపిసోడ్‌లో పార్టీ అధిష్ఠానం అండగా నిలబడటం రేవంత్‌కు ఒకింత ఊరట కలిగించే అంశమే. తెలుగునాట రెండో పర్యాయం అధికారంలోకి రావడం అంత ఆషామాషీ కాదు. ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, వైఎస్ రాజశేఖర రెడ్డి, రాష్ట్రం విడిపోయిన తర్వాత కేసీఆర్ మాత్రమే రెండో పర్యాయం అధికారంలోకి రాగలిగారు. పార్టీ ఏదైనా మొత్తం యంత్రాంగం ఒక్కటిగా నిలబడి ముఖ్యమంత్రిని మోసిన సందర్భాలలోనే చంద్రబాబు అయినా, రాజశేఖర రెడ్డి అయినా, కేసీఆర్ అయినా రెండోమారు అధికారంలోకి రాగలిగారు. మొత్తం పార్టీ యంత్రాంగం ముఖ్యమంత్రులను సొంతం చేసుకోని సందర్భాలలో ఇదే నాయకులు ఓడిపోయారు. ముఖ్యమంత్రి రేవంత్ మళ్లీ అధికారంలోకి రావాలంటే ముందుగా మొత్తం కాంగ్రెస్ పార్టీ ఆయనను సొంతం చేసుకోవాలి. కార్యకర్తల నుంచి నాయకుల వరకు అందరూ రేవంత్ నాయకత్వానికి జై కొట్టాలి. అలా అందరూ తన నాయకత్వాన్ని ఆమోదించేలా చేసుకోవాల్సిన బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌పైన కూడా ఉంటుంది. కాంగ్రెస్ అధిష్ఠానం అండదండలు కూడా ఉన్నందున తనను తాను బలమైన నాయకుడిగా తీర్చి దిద్దుకోవడానికి రేవంత్‌కు ఇదొక సదవకాశం. కాంగ్రెస్‌లో గ్రూపులు ఉండటం చూసి ఆశ్చర్యపోకూడదు. లేకపోతే ఆశ్చర్యపోవాలి. ఎన్నికల్లో గెలవడానికి సామాజిక సమీకరణలు మాత్రమే సరిపోవు. మొత్తంగా ప్రజల్లో సానుకూల అభిప్రాయం ఏర్పడాలి. అదే సమయంలో సీఎం ఎవరైనా వారి నాయకత్వం పట్ల ప్రజల్లో కూడా విశ్వాసం ఏర్పడాలి. రేవంత్ కూడా సీఎంగా ఐదేళ్లపాటు కొనసాగి పూర్తి కాలం పదవిలో ఉంటారని అనడంలో ప్రస్తుతానికి సందేహం లేదు. కాంగట ్రలో ఐదేళ్లు ముఖ్యమంత్రిగా ఉండటమే ఒక రికార్డు. అలాంటిది రెండో పర్యాయం పార్టీని గెలిపించుకొని అధికారంలో కొనసాగడం గొప్ప విషయమే అవుతుంది. పార్టీలోని అన్ని గ్రూపులను తన వైపునకు మళ్లించుకొని అందరూ రేవంత్ గ్రూపు మాత్రమే అని రుజువు చేసుకోగలిగినప్పుడే ఆయన శక్తి సామర్థ్యాలు వెల్లడవుతాయి. రాజకీయ ప్రత్యర్థుల నుంచి ఎదురయ్యే దాడుల నుంచి తప్పించుకొని బలంగా నిలబడే వారే నిజమైన నాయకుడిగా ఆవిష్కృతుడవుతారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో కొండా సురేఖ వ్యవహారం టీ కప్పులో తుపానుగా చల్లబడిపోతుందా? లేక మునుముందు కొత్త సవాళ్లకు దారి తీస్తుందా? ఇది ఇప్పటికిప్పుడు చెప్పలేని పరిస్థితి. సురేఖ ఎపిసోడ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ హైకమాండ్ వద్ద తన మాట నెగ్గించుకుని... ఆమెను బర్తరఫ్ చేసి పార్టీలో-- ప్రభుత్వంలో తన పట్టు పెంచుకున్నట్టు కనిపిస్తున్నారు. కానీ, సవాళ్లు మాత్రం తొలగిపోలేదు. తెలంగాణ కాంగ్రెస్ పైకి ఒక్కటిగా కనిపిస్తున్నా అంతర్గతంగా మూడు గ్రూపులుగా ఉంది. ఇప్పటి వరకు అచ్చ కాంగ్రెస్, పచ్చ కాంగ్రెస్ అని రెండు గ్రూపులు ఉండగా... ఇప్పుడు రాజశేఖరరెడ్డి వర్గం కూడా తెర మీదకు వచ్చింది. పార్టీలో ప్రత్యర్థులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని పచ్చ కాంగ్రెస్ ప్రతినిధిగా అభివర్ణిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన వారిని పచ్చ కాంగ్రెస్ వాళ్లు అని అంటున్నారు. అయితే, తెలంగాణ ఏర్పడిన తర్వాత అచ్చ కాంగ్రెస్ నాయకులుగానీ, రాజశేఖరరెడ్డి వర్గంగానీ పార్టీని అధికారంలోకి తీసుకురాలేకపోయారు. చివరకు తెలుగుదేశం పార్టీ నుంచి వచ్చిన రేవంత్‌రెడ్డి చేతికి పార్టీ పగ్గాలు అప్పగించిన తర్వాత 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఈ వాస్తవాన్ని గుర్తించిన కాంగ్రెస్ అధిష్ఠానం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఎన్ని ఫిర్యాదులు అందినా ఆయా సందర్భాలలో అండగా నిలిచింది. తాజాగా సురేఖ ఉదంతంలో కూడా ముఖ్యమంత్రి అభిప్రాయానికి విలువ ఇచ్చి ఆమెను బర్తరఫ్ చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే... పార్టీ అధిష్ఠానం ఈ నిర్ణయం తీసుకునే ముందు దాన్ని అడ్డుకొనే ప్రయత్నాలు జరగకపోలేదు. ఇద్దరు ముగ్గురు మంత్రులు బర్తరఫ్ నిర్ణయాన్ని అడ్డుకొనే ప్రయత్నం చేశారు. ఈ కారణంగానే నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరిగింది. కొండా సురేఖను బర్తరఫ్ చేయనిస్తే రేవంత్‌రెడ్డి బలపడతారన్న ఉద్దేశంతోనే ఈ ప్రయత్నాలు జరిగినట్టు చెబుతున్నారు. అయితే, రేవంత్‌రెడ్డిని కాదనుకునే పరిస్థితి లేకపోవడం, జరిగిన దానిపట్ల విచారం వ్యక్తం చేయడానికి కూడా సురేఖ సిద్ధపడకపోవడంతో పార్టీ అధిష్ఠానం బర్తరఫ్ నిర్ణయం వైపు మొగ్గ చూపాల్సి వచ్చింది.

## అసెంబ్లీ చరిత్రలో ఇది చీకటి రోజు

### ప్రజాప్రతినిధులను అరెస్ట్ చేయడం ప్రజాస్వామ్యంపై దాడి: రవీందర్ యాదవ్



సమయం ప్రతినిధి, కేశంపేట, సెప్టెంబర్ 7: తెలంగాణ అసెంబ్లీ సమావేశాల తొలిరోజే కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరించిన తీరు అప్రజాస్వామికంగా ఉందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రవీందర్ యాదవ్ తీవ్రంగా విమర్శించారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు వెళు_న్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోవడం, అనంతరం పలువురు ఎమ్మెల్యేలను అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆరోపించారు. కేశంపేటలో నిర్వహించిన కార్యక్రమంలో రవీందర్ యాదవ్ మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సహా పలువురు ఎమ్మెల్యేలను అరెస్ట్ చేయడాన్ని ఖండించారు. ముఖ్యంగా మహిళా ప్రజాప్రతినిధులతో పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. ప్రజల చేత ఎన్నుకోబడిన మహిళా ఎమ్మెల్యేలను గౌరవించకుండా నెట్టివేయడం, అడ్డుకోవడం వంటి ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతిపక్షం గొంతు వినిపించకుండా అసెంబ్లీని నిర్వహించాలనుకోవడం నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల సమస్యలు, ఎన్నికల హామీల అమలు, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించడం ప్రతిపక్షం బాధ్యత అని, ఆ ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రతిపక్ష నాయకులను అరెస్ట్ చేయడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం "ప్రశ్నిస్తే అరెస్ట్.. నిలదీస్తే కేసులు.. ప్రజల కోసం పోరాడితే అణచివేత" అనే విధానాన్ని అవలంబిస్తోందని రవీందర్ యాదవ్ ఆరోపించారు. అధికారంలో ఉన్నామనే అహంకారంతో ప్రతిపక్ష నాయకుల గొంతు నొక్కాలని చూస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. కేటీఆర్, హరీశ్‌రావు సహా అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను వెంటనే విడుదల చేయాలని, మహిళా ప్రజాప్రతినిధులతో అనుచితంగా వ్యవహరించిన పోలీసు అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజాప్రతినిధులకు రాజ్యాంగబద్ధమైన గౌరవం కల్పించాలని కోరారు. ఇది కేవలం బీఆర్ఎస్ నాయకులపై జరిగిన దాడి కాదని, తెలంగాణ ప్రజాస్వామ్య హక్కులపై జరిగిన దాడిగా అభివర్ణించారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ప్రజల తరఫున బీఆర్ఎస్ పోరాటం ఆగదని, ప్రజా సమస్యలను అసెంబ్లీలోనూ, ప్రజాక్షేత్రంలోనూ నిరంతరం ప్రశ్నిస్తామని రవీందర్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మురళీధర్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ జగదీశ్వర్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణ గౌడ్, మాజీ జడ్పీటీసీ పల్లె నర్సింగ్ రావుతో పాటు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వానాకాలం వరి కొనుగోళ్లపై కలెక్టర్ సమీక్ష




నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 7 : వానాకాలం వరి కొనుగోళ్లను సజావుగా నిర్వహించేందుకు ముందస్తు ప్రణాళికతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా అదనపు కలెక్టర్ చేన్నయ లతో వానాకాలం వరి కొనుగోళ్లపై ఆర్డీవోలు, తాహసిల్దార్లు ,ఎంపీడీవోలు సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., రైతులు పండించిన ధాన్యాన్ని ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేలా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో అవసరమైన ప్రాంతాలను గుర్తించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడంతో పాటు, కేంద్రాల్లో తూకం యంత్రాలు, గన్నీ సంచులు, టార్పాలిన్లు, ధాన్యం నిల్వకు అవసరమైన ఇతర సౌకర్యాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు సమయంలో నాణ్యత ప్రమాణాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హత కలిగిన ధాన్యాన్ని ఎలాంటి జాప్యం లేకుండా కొనుగోలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు తరలించేలా రవాణా ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని, అందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పరిష్కరించేలా మండల, జిల్లా స్థాయిలో సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ తదితర కనీస సౌకర్యాలను అందుబాటులో ఉంచాలని, అవసరమైన రక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతలపై పోలీసుల దమనకాండ



జడ్చర్ల సెప్టెంబర్ 7, సమయం ప్రతినిధి ప్రభాతవార్త: కాంగ్రెస్ ఎన్నికల హామీల అమలుపై ప్రశ్నిస్తూ నిరసన తెలిపితే పోలీసులు దాడులు చేయడం ఎంతవరకు సమంజసం అని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి ఫైర్ అయ్యారు. జడ్చర్ల ఎంపిడివో ఆఫీస్‌లో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఎంపిడివో కు వినతిపత్రం అందజేశారు. అనంతరం అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల పై పోలీసుల దమనకాండ,అరెస్టు కు నిరసనగా మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో జడ్చర్ల- కోదాడ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ రాస్తారోకో నిర్వహించి, సీఎం రేవంత్ రెడ్డి దిష్టి బొమ్మ దహనం చేశారు. అనంతరం మాజీ మంత్రి డా.సి.లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ప్రజావాణిలో కాంగ్రెస్ హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే లు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకొని, దుర్మార్గంగా ప్రవర్తించారని చెప్పారు. రాహుల్ గాంధీ కూడా పార్లమెంటులో టీ షర్ట్ లు వేసుకొని నిరసన తెలిపారని, తెలంగాణ అసెంబ్లీ లో టీ షర్ట్ లు వేసుకుంటే కాంగ్రెస్ అడ్డుకుంటుందన్నారు. వాళ్ళు ఇచ్చిన హామీలు అమలు చేయమంటే దౌర్జన్యం చేస్తున్నారని, ఎన్నికల ముందు వంద రోజుల్లో అమలు చేస్తామన్నారని, వెయ్యి రోజులైనా హామీల అమలు లేదని దుయ్యబట్టారు. బీ ఆర్ ఎస్ నిరసనలకు కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతుందన్నారు. వారం రోజులుగా ప్రజా క్షేత్రంలో బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని, అసెంబ్లీ లో కూడా బీ ఆర్ఎస్ నిలదీయాలని హామీలు గుర్తు చేస్తూ టీ షర్ట్‌లు వేసుకొని వచ్చారని చెప్పారు. మహిళా ఎమ్మెల్యేలను పోలీసులు అవమానించారని, పోలీసులను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ గొంతు నొక్కుతుందని ఇది సరైన పద్ధతి కాదన్నారు. రేవంత్ రెడ్డికి ఢిల్లీకి మూటలు పంపడం మీదనే శ్రద్ధ ఉందన్నారు. కేసీఆర్ ఎందుకు మీకు..మీరు ప్రజలకే సమాధానం చెప్పలేకపోతున్నారు. కేసీఆర్ చావు కోరుకుంటున్నందుకు అసెంబ్లీకి రావాలా? అంటూ ఫైర్ అయ్యారు. కేసీఆర్ ఎప్పుడూ రావాలో అప్పుడు వస్తారని, ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ప్రతిపక్ష నాయకుడు రావాలని పోరాడుతున్నారని అన్నారు.

## నిబంధనలు ఉల్లంఘిస్తే ఆస్పత్రులపై కఠిన చర్యలు



### ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: డీఎంహెచ్‌వో డా. ఏ. శ్రీనివాసులు

సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7: ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగానే ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డా. ఏ. శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం మహబూబ్‌నగర్ నగరంలోని శ్రీకర చిల్డ్రన్స్ హాస్పిటల్, భవిత సూపర్ స్పెషల్టీ హాస్పిటల్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రుల్లో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మౌలిక వసతులు, రికార్డులు, వైద్యులు, ఇతర సిబ్బంది వివరాలను పరిశీలించారు. శ్రీకర చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో ఫైర్ సేఫ్టీ ఏర్పాట్లను పరిశీలించిన డీఎంహెచ్‌వో, అగ్నిమాపక శాఖ ద్వారా ఎప్పటికప్పుడు ఫైర్ ఆడిట్, మాక్‌డ్రిల్ నిర్వహించాలని సూచించారు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సమయంలో సమర్పించిన వైద్యులు, ఇతర సిబ్బందిలో మార్పులు చోటుచేసుకుంటే వెంటనే జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయానికి వివరాలు అందజేసి ముందస్తు అనుమతి పొందాలని ఆదేశించారు. అలాగే ఆస్పత్రుల్లో అందించే వివిధ వైద్య సేవలకు సంబంధించిన ఛార్జీల పట్టికను తెలుగులో ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని స్పష్టం చేశారు. రోగులు, వారి బంధువులకు వైద్య సేవల ధరలపై పూర్తి అవగాహన ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రైవేట్ ఆస్పత్రులు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, తనిఖీల సందర్భంగా గుర్తించిన లోపాలను సరిదిద్దుకోవాలని డీఎంహెచ్‌వో తెలిపారు. నిబంధనల ఉల్లంఘనలను ఉపేక్షించబోమని, అవసరమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ ఆకస్మిక తనిఖీల్లో ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. శివకాంత్, జిల్లా కార్యక్రమ అధికారి సీతారామ్ గౌడ్, ఆరోగ్య విద్యావేత్తలు హన్మంతు, నర్సింహా, ఎం.పీ.హెచ్.ఈ.ఓ. సుభాష్ చంద్రతో పాటు వైద్యారోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజావాణిలో సమస్యల వెల్లువ

### 56 ఫిర్యాదులు.. సత్వర పరిష్కారానికి కలెక్టర్ ఆదేశం



రంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 7: ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా, అందిన ప్రతి ఫిర్యాదును పరిశీలించి నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మొత్తం 56 ఫిర్యాదులు అందాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించినవి 27 కాగా, ఇతర శాఖలకు సంబంధించినవి 29 ఉన్నాయి. ఫిర్యాదులను స్వీకరించిన కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించాలని, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కరించాలని సూచించారు. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ, నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపాలని ఆదేశించారు.

మట్టి గణపతితో పర్యావరణ పరిరక్షణ

ప్రజావాణి అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన "మట్టి గణపతిని పూజిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" పోస్టర్‌ను కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆవిష్కరించారు. వినాయక చవితి సందర్భంగా ప్రజలు పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కోరారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని, సహజసిద్ధమైన రంగులు, పర్యావరణహిత అలంకరణలను వినియోగించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సంబంధిత శాఖలు విస్తృత ప్రచారం చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారదతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో భవనం కూలిన ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి

మొదటి పేజీ తరువాయి

దేశ రాజధాని ఢిల్లీలోని సత్యనికేతన్‌లో ఐదంతస్తుల భవనం కూలిన ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన బాధాకరమని పేర్కొన్న ఆయన.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. 'సత్య నికేతన్‌లో హాస్టల్ భవనం కూలిన ఘటన తీవ్రంగా కలచివేసింది. తమ ఆప్తులను కోల్పోయిన వారికి నా సానుభూతి. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను' అని అన్నారు. ఘటనాస్థలిలో అధికారులు సహాయక చర్యలు చేపట్టినట్టు చెప్పారు. కాగా.. ఆదివారం మధ్యాహ్నం ఓ ఐదంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలడంతో ఆరుగురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. 11 మందిని సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి. ఇంకా పలువురు శిథిలాల కింద చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఈ భవనం సుమారు 75 పడకల సామర్థ్యంతో పేయింగ్ గెస్ట్(పీజీ) వసతిగా వినియోగిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గురైన భవనం.. ఢిల్లీ యూనివర్సిటీ సౌత్ క్యాంపస్‌కు సమీపంలో ఉండటంతో ఈ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు అక్కడ ఉంటున్నట్టు తెలుస్తోంది. అయితే.. ఈ భవనం 40-50 ఏళ్ల నాటిదని, కింది భాగంలో బేస్‌మెంట్‌తో పాటు పైన ఐదంతస్తులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ప్రమాద సమయంలో బేస్‌మెంట్‌లో మరమ్మతులు జరుగుతున్నాయని వెల్లడించారు. ఆ పనులకు, భవనం కూలిపోవడానికి మధ్య సంబంధం ఉందా? అనే కోణంలో దర్యాప్తు సాగిస్తున్నట్టు స్పష్టం చేశారు.

# ఇందిరమ్మ ఇళ్లకు నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

**గ్రామపంచాయతీ, వివో భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలి**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**





నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 7 : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేసి అర్హులైన లబ్ధిదారులకు సొంతింటి కలను సాకారం చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని, నిర్మాణ పనుల్లో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచా యతీ భవనం, విలేజ్ ఆర్గనైజేషన్ (VO) భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సూచించారు. సోమవారం నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని వెంకటా పురం గ్రామంలో పర్యటించిన జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్, గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లు, గ్రామపంచాయతీ భవనం, వివో భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. వెంకటాపురం గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. గ్రామంలో మొత్తం 12 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 8 ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని, మరో 2 ఇళ్ల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదని, ఆయా లబ్ధిదారులకు ఇప్పటికే నోటీసులు జారీ చేసినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులను కలెక్టర్ పిలిపించి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రయోజనాన్ని సద్వినియోగం చేసుకుని వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించాలని సూచించారు. నిర్మాణ పనులు ప్రారంభించకపోతే మంజూరు రద్దు చేసే అవకాశం ఉంటుందని, కలెక్టర్ స్పష్టం చేశారు. దీనికి స్పందించిన లబ్ధిదారులు రానున్న రెండు, మూడు రోజుల్లో ఇళ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తామని కలెక్టర్‌కు తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకం ద్వారా అందుతున్న ఆర్థిక సహాయం సకాలంలో అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణంలో ఉన్న ప్రతి ఇంటి పురోగతిని క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, లబ్ధిదారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడరాదని, నిర్దేశిత ప్రమాణాల మేరకు పనులు జరిగేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. అనంతరం గ్రామంలో నిర్మాణంలో ఉన్న గ్రామపంచాయతీ భవనం, విలేజ్ ఆర్గనైజేషన్ (VO) భవన నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఆయా భవనాల నిర్మాణ పనుల పురోగతిని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామపంచాయతీ భవనం, వివో భవన నిర్మాణ పనులను వేగవంతం చేసి, త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో ప్రభుత్వం నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, పనుల నాణ్యతపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేపట్టాలని, వివో భవనం మహిళా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలకు, సమావేశాలు మరియు ఇతర కార్యక్రమాలకు అనువుగా ఉండేలా నిర్మాణ పనులను నాణ్యతతో పూర్తి చేయాలని తెలిపారు. ప్రభుత్వ నిధులతో చేపడుతున్న నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాల విషయంలో రాజీపడకుండా, నిర్దేశిత అంచనాలు, మార్గదర్శకాల ప్రకారం పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ స్పష్టం చేశారు.జిల్లా కలెక్టర్ వెంట నాగర్ కర్నూల్ తహసీల్దార్ తబితా రాణి, నాగర్ కర్నూల్ ఎంపీడీవో చెన్నమ్మ, గ్రామ సర్పంచ్ నరసింహ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు ఉన్నారు.

## కీసరలో 239వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమం..



**కల్పిత నాయకుడు నీవురా హమారా!**
**రాజ్యాంగం, డా. బీఆర్ అంబేడ్కర్‌పై**
**అవగాహన రాహిత్య వ్యాఖ్యలు చేస్తే ఖబడ్దార్: కర్రె గణేష్**

వేకువ సమయం సెప్టెంబర్ 6 కీసర ప్రతినిధి: కీసర: భారత రాజ్యాంగం, రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేడ్కర్‌పై అవగాహన రాహిత్యంతో వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని కీసర మండల అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కర్రె గణేష్ హెచ్చరించారు. కీసరలో ఆదివారం నిర్వహించిన 239వ ఆదివారం జ్ఞానమాల కార్యక్రమంలో ఆయన పాల్గొని డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల సమర్పించారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహం సమీపంలో బైఠాయించి, చేతిలో భారత రాజ్యాంగ ప్రతిని పట్టుకుని హమారా ప్రసాద్ వ్యాఖ్యలను వ్యతిరేకిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కర్రె గణేష్ మాట్లాడుతూ ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ జీవిత చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను తీవ్రంగా ఖండించారు. అంబేడ్కర్‌పై పూర్తి అవగాహన లేకుండా ఆయన జీవితాన్ని తప్పుగా చిత్రీకరిస్తూ 'కల్పిత నాయకుడు' పేరుతో పుస్తకం రాస్తున్నారనే అంశాన్ని కీసర మండల అంబేడ్కర్ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు.డా. అంబేడ్కర్ ఆలోచనలు, రాజ్యాంగ సేవలు భారతదేశానికే పరిమితం కాలేదని, ప్రపంచవ్యాప్తంగా ఆయనకు గుర్తింపు ఉందని పేర్కొన్నారు. పలు దేశాల్లోని విశ్వవిద్యాలయాలు, సంస్థలు అంబేడ్కర్ విగ్రహాలను ఏర్పాటు చేసి ఆయన సేవలను స్మరించుకుంటున్నాయని తెలిపారు.భారత రాజ్యాంగం దేశ ప్రజలందరికీ సమాన హక్కులు, స్వేచ్ఛ, సామాజిక న్యాయం కల్పించిన గొప్ప పత్రం అని పేర్కొన్న ఆయన, రాజ్యాంగాన్ని లేదా రాజ్యాంగ నిర్మాతను కించపరిచే విధంగా ఎవరైనా వ్యవహరిస్తే ప్రజాస్వామ్య పద్ధతుల్లో తీవ్రంగా ప్రతిఘటిస్తామని అన్నారు. “భారత రాజ్యాంగం జోలికి వచ్చినా, బాబాసాహెబ్ అంబేడ్కర్ జోలికి వచ్చినా ఖబడ్దార్” అని కర్రె గణేష్ హెచ్చరించారు. చరిత్రను ఎవరైనా వక్రీకరించినంత మాత్రాన మహనీయుల గొప్పతనం తగ్గదని, డా. అంబేడ్కర్ దేశ చరిత్రలో చిరస్మరణీయుడిగా నిలిచిపోతారని అన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ఈ కార్యక్రమంలో మండల అంబేడ్కర్ సంఘం సంయుక్త కార్యదర్శి మంచాల మహేష్, కుర్రి పరమేష్, ఎంకిరాల నర్సింగ్, కీసర గ్రామ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు తుడుం బాల్‌రాజ్, బీఆర్ఎస్ కీసర గ్రామ శాఖ అధ్యక్షుడు చినింగని బాల్‌రాజ్, మండల అంబేడ్కర్ సంఘం మాజీ కోశాధికారి కానుకుంట్ల శ్యాం కుమార్, తిమ్మాయిపల్లి గ్రామ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు తాళ్ల అరవింద్, కమిటీ సభ్యులు, యాద్గార్‌పల్లి మాజీ అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడు కొమ్ము చిరంజీవి, నూతన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కండలు పెంచేందుకు ఇంజెక్షన్లు.. చివరికి ప్రాణాలకే ఎసరు!

**స్టెరాయిడ్ మైకంలో దాడులు.. పల్లెల్లో పెరుగుతున్న ఆందోళన**
**ఇంటికే స్టెరాయిడ్స్ డెలివరీ..!**
**రహస్య నెట్వర్క్ వెనుక ఉన్నది ఎవరు?**
**అక్రమ దందాపై ఔషధ నియంత్రణ అధికారుల దృష్టి ఎప్పుడు?**
**తాత్కాలిక బలం కోసం స్టెరాయిడ్స్, హార్మోన్ ఇంజెక్షన్లు**
**స్టెరాయిడ్ మైకంలో దాడులు.. ఆస్తుల ధ్వంసం**
**సరిహద్దు రాష్ట్రంలో ప్రత్యేక ముఠా ద్వారా పల్లెలకు కోరియర్ రవాణా**
**సందెరాళ్ల పోటీలను బ్యాండ్ చేయాలని పల్లెలో డిమాండ్**






సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల: ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాలలో శారీరక బలానికి, పౌరుషానికి ప్రతీకగా నిర్వహించే సంప్రదాయ సందెరాళ్ల పోటీలు నేడు శక్తి పెంచుకోవాలనే ఉద్దేశంతో కొందరు యువకులు స్టెరాయిడ్స్, హార్మోన్ ఇంజెక్షన్లు, పెయిన్‌కిల్లర్ మందులను మోతాదుకు మించి వినియోగిస్తున్నట్లు సమాచారం. గట్టు, కేటిదొడ్డి, ధరూర్, మల్దకల్, అయిజ వంటి సరిహద్దు మండలాల్లో పండుగలు, జాతర్లు, గ్రామ దేవతల ద్యావర్లు, ఉర్సుల సందర్భంగా 40 కిలోల నుంచి 120 కిలోల వరకు బరువున్న సందెరాళ్లను ఎత్తే పోటీలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ పోటీల్లో పాల్గొనే 20–30 ఏళ్ల యువతలో కొందరు బరువులను సులభంగా ఎత్తేందుకు స్టెరాయిడ్స్, పెయిన్‌కిల్లర్ ఇంజెక్షన్లను విచ్చలవిడిగా వినియోగిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

**స్టెరాయిడ్ ఇంజెక్షన్ లు వాడి మైకంలో దాడులు**

స్టెరాయిడ్స్ ఇంజెక్షన్ లకు బానిసైన కొందరు యువకులు కంట్రోల్ తప్పి కుటుంబ సభ్యులపై దాడులకు పాల్పడటం, ఆస్తులను ధ్వంసం చేయడం వంటి ఘటనలకు పాల్పడుతున్నట్లు ఇటీవల గట్టు మండలంలో వెలుగులోకి వచ్చాయి. గట్టు మండలంలోని ఒక గ్రామంలో స్టెరాయిడ్ ఇంజెక్షన్లకు అలవాటైన ఓ యువకుడు కుటుంబ సభ్యులపై దాడికి పాల్పడిన ఘటన జరిగినట్లు సమాచారం. మరో గ్రామంలో యువకుడు తన అన్నపై దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు.

గట్టు మండలంలోని మరో గ్రామంలో సందెరాళ్ల పోటీలో పాల్గొనేందుకు శక్తి కోసం స్టెరాయిడ్స్ వినియోగించిన ఓ యువకుడు మోతాదుకు మించి పలుమార్లు తీసుకోవడంతో అనారోగ్యానికి గురై మృతిచెందినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ధరూర్ మండలంలో ఓ యువకుడు పదేపదే స్టెరాయిడ్ ఇంజెక్షన్లు తీసుకోవడంతో చేతికి సంబంధించిన రక్తనాళాల్లో సమస్య ఏర్పడి, చేయి స్పర్శ కోల్పోయినట్లు సమాచారం. మరో గ్రామంలో స్టెరాయిడ్ ఇంజెక్షన్లకు అలవాటైన యువకులు మైకంలో అంగన్‌వాడీ కేంద్రం తలుపులు ధ్వంసం చేసినట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**కర్ణాటకు నుంచి రహస్య దందా?**

స్టెరాయిడ్స్, యాంటిబయాటిక్స్, హార్మోన్ ఇంజెక్షన్లు డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే నేరుగా కర్ణాటక కు చెందిన కొన్ని ముఠాలు బహిరంగానే సప్లయ్ చేస్తున్నారని తెలుస్తోంది. అంతేకాదు ఏయే గ్రామాల్లో పోటీలు నిర్వహిస్తారో తెలుసుకొని అక్కడికి వెళ్లి యువతకు స్టెరాయిడ్లు విక్రయిస్తుంటారు. కొందరు ఏజెంట్ల ముసుగులో మెడికల్? షాపుల నిర్వాహకులు కూడా దందాలోకి దిగినట్లు సమాచారం. అధికారుల తనిఖీలు సక్రమంగా లేకపోవడంతో దుకాణాల్లో దొంగచాటుగా విక్రయిస్తున్నారు. ఒక్క స్టెరాయిడ్? ఇంజెక్షన్? రూ. 1,500 – రూ. 1,800 వరకు విక్రయిస్తున్నట్లు సమాచారం.

**ఆరోగ్యంపై ప్రభావం...**

స్టెరాయిడ్స్ ఇంజెక్షన్ లు వైద్యుల పర్యవేక్షణ లేకుండా, అధిక మోతాదులో వినియోగించడం వల్ల గుండె, కిడ్నీలు, కాలేయం తదితర అవయవాలపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. తాత్కాలికంగా శక్తి పెరిగినట్లు అనిపించినా, దీర్ఘకాలంలో తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉందని సూచిస్తున్నారు.

**పల్లెల్లో నిఘా పెంచాలి**

యువత భవిష్యత్తును నాశనం చేసే అక్రమ స్టెరాయిడ్స్, హార్మోన్ ఇంజెక్షన్ల సరఫరాపై జిల్లా ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు. డ్రగ్ కంట్రోల్, పోలీస్ శాఖలు సంయుక్తంగా సరిహద్దు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించాలని, అక్రమ సరఫరా నెట్‌వర్క్‌లపై దర్యాప్తు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా స్టెరాయిడ్స్, అధిక మోతాదు యాంటిబయాటిక్స్, పెయిన్‌కిల్లర్ ఇంజెక్షన్లు విక్రయించే మెడికల్ షాపులను తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఆర్ఎంపీలపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## 420 హామీలు అమలు పై తహసిల్దార్ గారికి వినతిపత్రం సమర్పించి మల్దకల్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు




సమయం ప్రతినిధి: జోగులాంబ గద్వాల్ గద్వాల నియోజకవర్గం మల్దకల్ మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో 1000 రోజుల కాంగ్రెస్ వైఫల్య పాలనలో భాగంగా...420 హామీలను అమలుపై, నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు గారి ఆదేశాల మేరకు మల్దకల్ మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజావాణిలో 6 గ్యారంటీలు, 420 హామీలను అమలు చేయాలని ఎంపీడీవో చెన్నయ్య గారికి వినతి పత్రం సమర్పించి,నిరసన తెలిపారు. కార్యక్రమంలో పటేల్ జనార్దన్ వీరేష్ గౌడుడి.శేఖర్ నాయుడు, సర్పంచు సత్యాన్న, తిమ్మప్ప గౌడ్,అవని శ్రీ, తిరుమలేష్, నరసింహులు, గోవిందు, వీరేష్, భాస్కర్, మహేందర్, నరేష్, హరికృష్ణ, జయన్న, మరియు నాయకులు తదితరులు....

## రోస్టర్ విధానంతో మాలలకు విద్యా ఉద్యోగాల్లో తీవ్ర నష్టం

దేవరకొండ: సెప్టెంబర్ 6 (సమయం ప్రతినిధి) : మాలలకు విద్య, ఉద్యోగాలలో తీవ్ర నష్టం జరిగే విధంగా ప్రభుత్వం రూపొందించిన రోస్టర్ విధానాన్ని సవరించేందుకు రేపు 07/09/2027నుండి జరగబోయే వర్షాకాలం అసెంబ్లీ సమావేశాలలో మాల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మాలల పక్షాన తమ గొంతు వినిపించాలని లేని పక్షంలో మాలల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి పేర్కొన్నారు. ఆదివారం దేవరకొండ పట్టణంలోని మాల మహానాడు రాజ గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో గ్రూప్ 3 లోని మాల, ఉప కులాలు 26 కులాలకు 5% రిజర్వేషన్లు కేటాయించినప్పటికీ విద్యా ఉద్యోగ నోటిఫికేషన్‌లో రెండు శాతం కూడా అవకాశాలు దక్కడం లేదని ఇది మాలల రాజ్యాంగ బద్ధహక్కులను కాలరాయడమేనని, దీనిపై మాలలంతా 16 నెలలుగా వివిధ కార్యక్రమాలతో పోరాటం చేస్తున్నప్పటికీ మాల శాసనసభ్యులు, శాసన మండలి సభ్యులు నిమ్మకు నీరేత్తినట్టుగా ఉంటున్నారని, మంత్రి వివేక్ వెంకటస్వామి ఎమ్మెల్యే నాగరాజు మాత్రమే జాతి పక్షాన మాట్లాడుతున్నారని మిగతావారు ఎందుకు మౌనంగా ఉంటున్నారో అర్థం కావడం లేదు అని , ఈ అసెంబ్లీ సమావేశాల్లో ప్రతి ఒక్క మాల శాసనసభ్యులు మాట్లాడాలని కోరారు అదేవిధంగా 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి మాలలు అండగా ఉన్నారని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ 01/08/ 2024 ఎస్సీ వర్గీకరణ చేసి మాలలకు తీవ్ర అన్యాయం చేసిందని అన్నారు భారతదేశంలోని 29 రాష్ట్రాలలో ఏ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేయలేదని తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేసి మాలల ని అణిచిచివేయాలని చూస్తుందని రోస్టర్ పాయింట్లను సవరించి మాలలకు న్యాయం చేయనట్లయితే ప్రభుత్వానికి మాలలు తగిన గుణపాఠం చెప్తారని మాల మహానాడు దేవరకొండ నియోజకవర్గం అధ్యక్షులు బోయిని చంద్రమౌళి హెచ్చరించారు ప్రభుత్వంపై పోరాడేందుకు భవిష్యత్ కార్యాచరణను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు అంతర్జాతీయ గుర్తింపు

వేకువ సమయం సెప్టెంబర్ 6 కీసర ప్రతినిధి : మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా : బాల్య వివాహాలకు వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో ఉద్యమం కొనసాగిస్తున్న సాధన సంస్థ, నవంబర్ 27ను 'బాల్య, దశలో జరిగే మరియు బలవంతపు వివాహాల నిర్మూలన అంతర్జాతీయ దినోత్సవంగా ప్రకటించిన ఐక్యరాజ్యసమితి నిర్ణయాన్ని స్వాగతించింది. జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ (JRC) భాగస్వామ్యంతో సాధన సంస్థ జిల్లాలో పాఠశాలలు, గ్రామాలు, పంచాయతీల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ బాల్య వివాహాలను అడ్డుకుంటోందని సంస్థ డైరెక్టర్ డా. ఆలూరి కామేశ్వరి తెలిపారు. బాల్య వివాహాల ముప్పులో ఉన్న కుటుంబాలను ప్రభుత్వ సంక్షేమ పథకాలతో అనుసంధానించడం,బడి మానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించడం వంటి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక అంతర్జాతీయ దినోత్సవం కోసం జీ=జ వ్యవస్థాపకుడు భువన్ రిభు చేసిన అంతర్జాతీయ ఉద్యమానికి సుమారు 67 దేశాల మద్దతు లభించగా, సెప్టెంబర్ 4న ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని ఆమోదించిందని పేర్కొన్నారు. 2024 నవంబర్ 27న భారత ప్రభుత్వం 'బాల్య వివాహ రహిత భారత్' ప్రచారాన్ని ప్రారంభించిన రోజే కావడం విశేషమని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలన కేవలం చట్టాల అమలుతో సాధ్యం కాదని, ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు పాఠశాలలు, గ్రామాలు, పంచాయతీలు, పోలీసులు, మత పెద్దలు, ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో ఒక్క బాలుడు లేదా బాలిక కూడా బాల్య వివాహం ముప్పులో లేని పరిస్థితి ఏర్పడే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని డా. కామేశ్వరి స్పష్టం చేశారు.

వేకువ సమయం
మంగళవారం 08 సెప్టెంబర్ 2026

# ఎస్ఐఆర్ ప్రక్రియ వేగవంతం



సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7: జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం కొనసాగుతోందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన దృశ్య శ్రవణ సమావేశంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి కలెక్టర్ వివరించారు. జిల్లాలో

**2.36 లక్షల మంది ఓటర్లకు నోటీసులు.. 77 శాతం పంపిణీ పూర్తి**
**నిర్ణీత గడువులోగా విచారణ పూర్తి చేస్తాం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

ఇప్పటివరకు 2,36,590 మంది ఓటర్లకు నో మ్యాపింగ్, మ్యాపింగ్‌లో వ్యత్యాసాలు ఉన్న కేటగిరీల కింద నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసుల పంపిణీతో పాటు విచారణ ప్రక్రియ కూడా వేగంగా కొనసాగుతోందన్నారు. ఇప్పటివరకు 77 శాతం నోటీసుల పంపిణీ పూర్తయిందని, మిగిలిన నోటీసుల పంపిణీని ఈ వారంలోగా పూర్తి చేస్తామని కలెక్టర్ తెలిపారు. అనంతరం విచారణలను కూడా త్వరితగతిన పూర్తి చేసి, మొత్తం ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు.

ప్రతి ఓటరుకు నోటీసులు అందించాలి

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, అనుమానాస్పద వివరాలు, నో మ్యాపింగ్ కేటగిరీల్లో గుర్తించిన ప్రతి ఓటరుకు నోటీసులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. నోటీసులు అందించిన అనంతరం సంబంధిత ఓటర్లకు విచారణకు పూర్తి అవకాశం కల్పించాలని సూచించారు. విచారణ సందర్భంగా ఓటర్ల వివరాలను నిబంధనల ప్రకారం క్షుణ్ణంగా పరిశీలించాలని, ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి కేసుకు సంబంధించిన వివరాలను సక్రమంగా నమోదు చేయడంతో పాటు, నోటీసుల పంపిణీ, విచారణ ప్రక్రియలను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, ఆర్డీఓ నవీన్, ఎన్నికల డీటీ జాఫర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో విజయ డైరీ పార్లర్ ప్రారంభం

**మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహణ.. పాల ఉత్పత్తులు అందుబాటులో**




సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7: జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విజయ డైరీ పార్లర్‌ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం ప్రారంభించారు. ఇందిరా మహిళా శక్తి మహబూబ్‌నగర్ మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఈ పార్లర్ నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌కు వచ్చే అధికారులు, సిబ్బంది, ప్రజలకు విజయ డైరీకి సంబంధించిన వివిధ పాల ఉత్పత్తులు అందుబాటులో ఉండేలా పార్లర్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పాలు, పాల ఉత్పత్తులను ఒకే చోట అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పార్లర్ నిర్వహణ చేపట్టడం ద్వారా మహిళలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అధికారులు తెలిపారు. నాణ్యమైన పాల ఉత్పత్తులను ప్రజలకు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, సహాయ కలెక్టర్ (శిక్షణలో) సాయి శివాని, డీఆర్డీఓ నరసింహులు, జిల్లా డైరీ శాఖ డీడీ శ్రీనివాస్, మహిళా సమాఖ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## అసెంబ్లీలో ప్రశ్నించే గొంతును నొక్కేయడం ప్రజాస్వామ్యానికే అవమానం

- ప్రతిపక్షాన్ని అడ్డుకోవడం కాదు.. ప్రజల సమస్యలకు సమాధానం చెప్పాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అడ్డుకోవడం హేయమైన చర్య
- మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్
- అంబేద్కర్ సాక్షిగా కాంగ్రెస్ అప్రజాస్వామిక వైఖరిపై బీఆర్ఎస్ నిరసన

షాద్‌నగర్: బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రానివ్వకుండా పోలీసులతో అడ్డుకున్న కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి షాద్‌నగర్ ఎంపీడీఓ కార్యాలయంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంజయ్య యాదవ్ మాట్లాడుతూ.. ప్రజలు ఎన్నుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం అత్యంత హేయమైన చర్య అని మండిపడ్డారు. ప్రజల సమస్యలను అసెంబ్లీలో ప్రశ్నించే ప్రతిపక్ష గొంతును నొక్కేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశంగా కనిపిస్తోందన్నారు. ప్రజాస్వామ్యానికి రాజ్యాంగం ద్వారా బలమైన పునాది వేసిన డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు నిరసన చేపట్టడం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరిని ప్రజలకు తెలియ జేస్తున్నామని అన్నారు. ప్రజల తరఫున ప్రశ్నించే గొంతులను ఎన్ని విధాలుగా అడ్డుకున్నా బీఆర్ఎస్ వెనక్కి తగ్గదని, ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం కొనసాగిస్తామని అంజయ్య యాదవ్ స్పష్టం చేశారు.

## స్క్రాప్‌కు అమ్మినా పన్ను బకాయి తప్పదు

**స్క్రాప్‌కు ముందు ఆర్టీఏకు సమాచారం ఇవ్వాలి:**
**మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్**

మహబూబాబాద్ సెప్టెంబర్ 7 (వేకువ సమయం ప్రతినిధి):మహబూబాబాద్ జిల్లా:వాహనాలను స్క్రాప్ (తుక్కు) కింద విక్రయించే యజమానులు రవాణా శాఖ నిబంధనలు పాటించాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ సూచించారు. ముఖ్యంగా బస్సులు, లారీలు, ఇతర వాణిజ్య వాహనాలను స్క్రాప్‌కు విక్రయించే ముందు ఆర్టీఏ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. జిల్లాలో పన్ను బకాయిలున్న వాహనాల యజమానులకు ఆర్టీఏ అధికారులు నోటీసులు జారీ చేస్తున్న నేపథ్యంలో కొందరు యజమానులు తమ వాహనాలను ఇప్పటికే తుక్కుగా విక్రయించామని చెబుతున్నారని తెలిపారు. అయితే వాహనాన్ని స్క్రాప్‌కు అమ్మినంత మాత్రాన దానిపై ఉన్న పన్ను బకాయి రద్దు కాదని స్పష్టం చేశారు. పన్నులు చెల్లించకుండా వాహనాన్ని స్క్రాప్‌కు విక్రయిస్తే, ఆ బకాయి యజమాని పేరుపై కొనసాగుతుందని చెప్పారు. బకాయిలు సకాలంలో చెల్లించకపోతే పెనాల్టీలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. అందువల్ల వాహనాన్ని స్క్రాప్‌కు విక్రయించే ముందే పన్ను బకాయిలను నిబంధనల ప్రకారం చెల్లించి, ఆర్టీఏ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. పన్నులు చెల్లించని వాహన యజమానులు మీసేవ కేంద్రాలు, ఆన్‌లైన్ సెంటర్లు లేదా మొబైల్ ఫోన్ ద్వారా ఆన్‌లైన్‌లో పన్నులు చెల్లించుకోవచ్చని తెలిపారు. అనవసరమైన పెనాల్టీలకు గురికాకుండా పన్నులను సకాలంలో చెల్లించాలని కోరారు. మోటార్ వెహికల్స్ యాక్ట్-1988లోని సెక్షన్ 55 ప్రకారం నిబంధనలకు అనుగుణంగా లేని వాహనాల రిజిస్ట్రేషన్‌పై రద్దు వంటి చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిపారు. వాహన యజమానులు రవాణా శాఖ నిబంధనలు పాటిస్తూ పన్ను బకాయిలను వెంటనే చెల్లించాలని మహబూబాబాద్ జిల్లా రవాణా శాఖ అధికారి శంకర్ నాయక్ విజ్ఞప్తి చేశారు.

## కేటీఆర్ పై పోలీసుల తీరు సరికాదు

**మహిళా ఎమ్మెల్యేల చీరలు లాగడం దుర్మార్గం....**
**పోలీసుల తీరుపై మండిపడ్డ పాలమూరు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి**

సమయం ప్రతినిధి : తెలంగాణ అసెంబ్లీ ప్రాంగణం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై మరియు మహిళా ఎమ్మెల్యేలపై పోలీసులు ప్రవర్తించిన తీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తీవ్రంగా మండిపడ్డారు. మహిళా ప్రజాప్రతినిధులని కూడా చూడకుండా వారిపై చేయి చేసుకోవడం, దురుసుగా ప్రవర్తించడం అత్యంత దుర్మార్గమైన చర్య అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు వాహనంలోకి బలవంతంగా ఎక్కించే క్రమంలో జుట్టు పట్టుకుని లాగడంపై మరియు ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అసెంబ్లీ ప్రాంగణంలోకి వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని, ఆమె చీర లాగి అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనతో మహిళా ఎమ్మెల్యేలు తీవ్ర మనస్తాపానికి గురైన అసెంబ్లీ ముందే కంటతడి పెట్టుకున్నారని అంతే కాకుండ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి పై, ఎమ్మెల్యే డా.సంజయ్ మరియు ఎమ్మెల్సీలు శంభీపూర్ రాజు,యాదవ రెడ్డి తదితరులపై పోలీసుల దాడి చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రజల తరఫున గొంతు వినిపించడానికి ఎమ్మెల్యేల,ఎమ్మెల్సీల పట్ల ఇంత క్రూరంగా, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం ప్రజాస్వామ్యంలో ఇది చీకటి రోజని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు.. ప్రతి పేద కుటుంబం సొంతింటి కల!



మక్తల్ : తెలంగాణ రాష్ట్ర మంత్రిడాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు... మక్తల్ నియోజకవర్గం నర్వ మండలంలోని పెద్దకడమూరు కొత్తపల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఎంపీడీవో టీ. శ్రీనివాసులు ఆధ్వర్యంలో రిబ్బన్ కట్ చేసి లబ్ధిదారుల నూతన గృహప్రవేశ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ ,మండల నాయకులు జగన్ మోహన్ రెడ్డి , నర్వ మండల ఉపాధ్యక్షులు శరన్ ,మండల ప్రచార కార్యదర్శి బీసం రవికుమార్ , పెద్దకడమూరు గ్రామ సర్పంచ్ గోవిందు , కొత్తపల్లి గ్రామ సర్పంచ్ జనార్ధన చారి ,ఉప సర్పంచులు, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్దకడమూరు మరియు కొత్తపల్లి గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## మదనపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎడ్లబండ్ల ర్యాలీ..





**కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఎంపిడివో కార్యాలయం ప్రజావాణిలో వినతిపత్రం అందజేసిన మాజీ ఎమ్మెల్యే ఆల**

(సమయం ప్రతినిధి కొత్తకోట) : అసెంబ్లీ వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే లు,ఎమ్మెల్సీ ల పై పోలీసుల దమనకాండ, అరెస్ట్ కు నిరసనగా నల్ల జెండాలు ధరించి మదనపూర్ మండల కేంద్రంలో ఆత్మకూరు,వనపర్తి రహదారిపై బైఠాయించి దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి..,ఆల ప్రీతి రెడ్డి.., బీఆర్ఎస్ శ్రేణులు.. నిరసన తెలిపాయి. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ప్రసంగంలోని ముఖ్య అంశాలు. హామీల అమలు చేయాలని ఆరు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపట్టాం.. కాంగ్రెస్ వెయ్యి రోజుల దగా పాలన నిరసన కార్యక్రమాలకు మంచి స్పందన వస్తుంది. కాంగ్రెస్ ఏం చేయదని ప్రజలకు అర్థమైంది. ఆరు గ్యారెంటీ లు,420 హామీలు అంతా బోగస్ అని తేలిపోయింది. ప్రజాక్షేత్రంతో పాటు అసెంబ్లీలో బీఆర్ఎస్ నిలదీయాలనుకుంది. కానీ బీఆర్ఎస్ ఎమ్మెల్యే లు,ఎమ్మెల్సీ లపై పోలీసులు దుర్మార్గంగా వ్యవహరించారు. నల్ల టీ షర్ట్ లు వేసుకున్నారని సాకు చెప్పి అసెంబ్లీకి రాకుండా అడ్డుకున్నారు. నల్ల టీ షర్ట్ లు వేసుకొని నిరసన తెలిపే హక్కు ఉంది. టీ షర్ట్‌ల మీద అభ్యంతరకరమైన భాష ఏం లేకపోయినా పోలీసులు దౌర్జన్యం చేశారు. మా ఎమ్మెల్యేలకు గాయాలు అయ్యాయి. ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం. సీఎం ఆదేశాలతో మహిళ ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమానవీయంగా ప్రవర్తించారు. పోలీసులను అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్ గొంతు నొక్కలేరు.. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి అందించడం లో విఫలమైంది. కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను బీఆర్ఎస్ ఎండగడుతుంటే ఉలిక్కిపడుతుంది. అసెంబ్లీలో బీఆర్ఎస్ నిలదీస్తుందని ప్రభుత్వం వణికిపోతుంది. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేసే వరకు ప్రజల పక్షాన పోరాడుతామన్నారు.

## అంబేద్కర్‌ను అవమానిస్తే ఊరుకోం : హమారా ప్రసాద్ పై కేసు నమోదు చెయ్యాలి

– వంగూరి జయశంకర్

**టీఎంజేఎఫ్, దళిత సంఘాల ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు**




నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి (సెప్టెంబర్ 07): రాజ్యాంగ నిర్మాత భారతరత్న డా. బి.ఆర్. అంబేద్కర్ ను కించపరుస్తూ, ఆయనను 'కల్పిత నాయకుడు' అంటూ 'కల్పిత నాయకుడు – ది ఫ్యాబ్రికేటెడ్ లీడర్' అనే పుస్తకం రాసిన రచయిత హమారా ప్రసాద్ పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ మాదిగ జర్నలిస్టు వంగూరి జయశంకర్ ఆధ్వర్యంలో టీఎంజేఎఫ్, దళిత సంఘాల నాయకులు సోమవారం నాగర్ కర్నూల్ పోలీస్ స్టేషన్ లో సీఐ వెంకట్ రెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వంగూరి జయశంకర్ మాట్లాడుతూ "బాబాసాహెబ్ అంబేద్కర్ ను 'కల్పిత నాయకుడు' అనడం కోట్లాది మంది దళిత, గిరిజన, బహుజనుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే. ఆ పుస్తకంలో అంబేద్కర్ గారిని 'దేశ వ్యతిరేకి, హిందూ వ్యతిరేకి, వేర్పాటువాది' అంటూ చిత్రీకరించి సామాజిక వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా రాశారు. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛ కాదు, నేరుగా రాజ్యాంగంపై చేస్తున్న దాడి" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ గారు ఆర్టికల్ 14 ద్వారా ఇచ్చిన సమానత్వపు హక్కు, ఆర్టికల్ 17 ద్వారా అంటరానితనాన్ని నిషేధించడం వల్లే ఈ రోజు మేమంతా గౌరవంగా బతుకుతున్నామని, అలాంటి మహనీయుడిని అవమానిస్తే దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు తప్పవని హెచ్చరించారు.

**మా డిమాండ్లు:**

1. హమారా ప్రసాద్ పై ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ చట్టం మరియు బీఎన్ఎస్ సెక్షన్ల కింద వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి అరెస్ట్ చేయాలి.
2. 'కల్పిత నాయకుడు' పుస్తకాన్ని తెలంగాణ ప్రభుత్వం వెంటనే నిషేధించాలి.
3. ఇలాంటి విద్వేషపూరిత రచనలను ప్రోత్సహిస్తున్న వారిపై కూడా విచారణ జరపాలి.

ఈ కార్యక్రమంలో టీఎంజేఎఫ్. జిల్లా కన్వీనర్ వెంకటేష్ ప్రతినిధులు, దళిత దండు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొత్త నాగేష్ సంఘాల నాయకులు జెట్టి కిషోర్ , మాదిగ జర్నలిస్టుల ఫోరం సభ్యులు సుధాకర్. మహేష్. వినోద్. పాల్గొన్నారు.

## రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్ వేసుకొని పార్లమెంట్‌కు వెళ్లొచ్చు...



(సమయం ప్రతినిధి అమరచింత) : నేడు తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 6 గ్యారెంటీలు మరియు 420 హామీలు అమలు చేయాలనీ నల్ల టీషర్ట్స్ ధరించి అసెంబ్లీ కి వెళ్లిన BRS పార్టీ ఎమ్మెల్యే ల పై దురుసుగా ప్రవర్తిస్తూ, మహిళా ఎమ్మెల్యేల పై అసభ్యంగా ప్రవర్తించి, అక్రమంగా అరెస్టు చేయడం జరిగింది... కాంగ్రెస్ ప్రభుత్వ అక్రమ అరెస్టులను ఖండిస్తూ నిరసనగా...మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రాంమోహన్ రెడ్డి ఆదేశానుసారం... సోమవారం నాడు అమరచింత మండల కేంద్రంలో BRS పార్టీ ఆధ్వర్యంలో BRS పార్టీ నాయకులు నల్ల కండువాలు ధరించి ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది... ఈ కార్యక్రమంలో అమరచింత పట్టణ మరియు మండల BRS పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు...

# భూ రీ-సర్వే ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలి





**10 రోజుల్లో రీ-సర్వే ప్రక్రియ పూర్తి చేయాలి**
**ఎస్ ఐ ఆర్ ప్రక్రియను సజావుగా పూర్తి చేయాలి**
**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**

**నాగర్ కర్నూల్ సమయం ప్రతినిధి సెప్టెంబర్ 07:** భూముల రీ-సర్వే ప్రక్రియను ఎలాంటి లోపాలకు తావులేకుండా పకడ్బందీగా నిర్వహించి, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ అధికారులను ఆదేశించారు. నాగర్‌కర్నూల్ మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూముల రీ-సర్వే ప్రక్రియను సోమవారం జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ఆకస్మికంగా క్షేత్రస్థాయిలో పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న సర్వే పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, సర్వే బృందం, సంబంధిత అధికారులతో మాట్లాడి ఇప్పటివరకు చేపట్టిన సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ....., భూముల రీ-సర్వే ప్రక్రియను అత్యంత ఖచ్చితత్వంతో, పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సర్వే సమయంలో భూముల విస్తీర్ణం, సర్వే నంబర్లు, గ్రామ సరిహద్దులు, గ్రామకంఠం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, సంబంధిత రికార్డులతో సరిపోల్చాలని సూచించారు. వెంకటాపూర్ గ్రామంలో మొత్తం 95 సర్వే నంబర్ల పరిధిలో 661 ఎకరాల 4 గుంటల భూమి ఉన్నట్లు అధికారులు జిల్లా కలెక్టర్‌కు వివరించారు. అదేవిధంగా సర్వే చేసిన గ్రామ సరిహద్దుల మొత్తం విస్తీర్ణం 670 ఎకరాల 15 గుంటలు, గ్రామకంఠం విస్తీర్ణం 14 ఎకరాల 14 గుంటలు, పాత గ్రామకంఠం విస్తీర్ణం 4 ఎకరాల 24 గుంటలు ఉన్నట్లు తెలిపారు.ప్రస్తుతం గ్రామంలో రోడ్ల సర్వే కొనసాగుతోందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. రోడ్ల సర్వే పూర్తయిన అనంతరం ప్రభుత్వ భూముల సర్వే, ఆ తర్వాత పట్టా భూముల సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు. భూ రీ-సర్వే పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా మొత్తం రీ-సర్వే ప్రక్రియను 10 రోజుల్లో పూర్తి చేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సర్వే ప్రక్రియలో ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో గుర్తించిన వివరాలను సంబంధిత రికార్డులతో సమన్వయం చేసుకుంటూ నమోదు చేయాలని సూచించారు. సర్వే బృందాలు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. భూ రీ-సర్వే ద్వారా భూముల హద్దులు, విస్తీర్ణం, రికార్డులను మరింత స్పష్టంగా నిర్ధారించేందుకు అవకాశం ఉన్నందున, ఈ ప్రక్రియలో ఖచ్చితత్వం, పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. అదేవిధంగా గ్రామంలో బూత్ స్థాయి అధికారుల ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి ఓటర్ల జాబితా ప్రకారం నోటీసుల జారీ, నోటీసులు అందుకున్న ఓటర్లు సమర్పిస్తున్న ధ్రువపత్రాల ఆధారంగా ఆన్లైన్ నిర్వహణ తదితర అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఓటర్ల జాబితా ప్రక్రియను సజావుగా నిర్వహించేలా బూతు స్థాయి అధికారులు, గ్రామస్థాయిలోని బూత్ స్థాయి పార్టీల ఏజెంట్లతో సమన్వయం చేసుకొని ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ తబితా రాణి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ గిరిధర్, డిప్యూటీ సర్వేయర్, లైసెన్స్ సర్వేయర్ తదితరులు ఉన్నారు.

## విద్యార్థి విజయానికి గురువే పునాది



వేకువ సమయం సెప్టెంబర్ 6 కీసర ప్రతినిధి: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కీసర: జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతగా పూంద్రు సుధాకర్ కీసర మండలం కరీంగూడ MPPS పాఠశాలలో SGTగా విధులు నిర్వహిస్తున్న పూంద్రు సుధాకర్ జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. విద్యార్థుల అభ్యున్నతికి, నాణ్యమైన విద్యాబోధనకు ఆయన చేస్తున్న కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు, తోటి ఉపాధ్యాయులు ఆయనకు అభినందనలు తెలిపారు. జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను అదనపు కలెక్టర్ ( లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్ శాలువతో సత్కరించి ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## వేదమంత్రోచ్చారణల నడుమ శ్రీ రామలింగేశ్వర స్వామివారికి విశేష అభిషేకం

వేకువ సమయం సెప్టెంబర్ 7 కీసర ప్రతినిధి: శ్రావణ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కీసరగుట్టలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కీసరగుట్టలోని శ్రీ భవాని శివదుర్గ సమేత రామలింగేశ్వర స్వామివారికి వేదమంత్రోచ్చారణల మధ్య ఆలయ అర్చకులు విశేష అభిషేకాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేక అభిషేక కార్యక్రమంలో భాగంగా స్వామివారికి పవిత్ర ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి, అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు చేపట్టారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, ఆలయ ఘంటానాదాలతో కీసరగుట్ట ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రావణ ఏకాదశి సందర్భంగా స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు స్వామివారిని దర్శించుకుని తమ కుటుంబాలకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని స్వామిని వేడుకున్నారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తటాకం వెంకటేష్ శర్మ, ఆలయ మాజీ చైర్మన్ తటాకం నాగలింగం శర్మతో పాటు ఆలయ సిబ్బంది, అర్చకులు, పలువురు భక్తులు పాల్గొన్నారు. శ్రావణ మాసంలో నిర్వహించిన ఈ ప్రత్యేక అభిషేకంతో కీసరగుట్టలో భక్తి, ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

## ప్రజా ప్రజల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమాన్ని వేగవంతం చేయాలి

మహబూబాబాద్ సెప్టెంబర్ 7 (వేకువ సమయం ప్రతినిధి):ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిర్వహించే 'ప్రజావాణి' కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించేందుకు అధికారులు నిబద్ధతతో పనిచేయాలని కలెక్టర్ స్నేహ శబరిష్ తెలిపారు.అదనపు కలెక్టర్ రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇంచార్జీ అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు, హౌసింగ్ పీడీ పురుషోత్తం, డిఆర్ఓ నాగలక్ష్మి, న్యాయ సేవ సంస్థ ప్రతినిధి ఆనంద్ కుమార్, అన్ని విభాగాల అధికారులతో కలిసి ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తమ పరిధిలో ఉంటే వెంటనే పరిష్కరించాలని లేనిపక్షంలో సంబంధిత విభాగానికి సిఫారసు చేసి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని ఈ ప్రక్రియలో ప్రతి ఒక్క ఉద్యోగి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని అన్నారు. ప్రజావాణికి వచ్చే అర్జీదారులు తమ దరఖాస్తును స్పష్టమైన అక్షరాలతో రాయాలి. వినతిపత్రంలో పేరు, చిరునామా, ఫోన్ నంబర్ తప్పనిసరిగా పేర్కొనాలని,సమస్యకు సంబంధించిన అవసరమైన ధృవీకరణ పత్రాలు (ఆధార్ కార్డు, రేషన్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం మొదలైనవి) జిరాక్స్ నకళ్లను అర్జీకి జత చేయాలని ప్రజావాణి నిర్వహించే రోజున (ప్రతి సోమవారం) ఉదయం 10:30 గంటల లోపు పేరు నమోదు చేసుకోవాలన్నారు,టోకెన్ ప్రాతిపదికన మాత్రమే అధికారులను కలవాల్సి ఉంటుంది. కావున ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ పాటించి, సహకరించాలి.పాత దరఖాస్తులు: ఇదివరకే దరఖాస్తు చేసుకుని ఉంటే, ఆ పాత దరఖాస్తు లేదా ఐడీ నంబర్‌ను కొత్త అర్జీతో పాటు సమర్పించాలి. జిల్లాలోని అన్ని శాఖల ముఖ్య అధికారులు ప్రజావాణికి ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 1:30 గంటల వరకు తప్పనిసరిగా హాజరుకావాలి. అత్యవసర పరిస్థితి ఉంటే మినహా ముందస్తు అనుమతి లేకుండా గైర్హాజరు కాకూడదు.త్వరితగతిన పరిష్కారం: స్వీకరించిన అర్జీలను, నిర్ణీత కాలపరిమితి లోగా పరిష్కరించాక్షేత్రస్థాయి పరిశీలన: సమస్య తీవ్రతను బట్టి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి స్వయంగా పరిశీలించి బాధితులకు న్యాయం చేయాలన్నారు, దరఖాస్తుపై తీసుకున్న చర్యలు లేదా తిరస్కరించడానికి గల సరైన కారణాలను అర్జీదారునికి లిఖితపూర్వకంగా లేదా ఎస్ఎమ్ఎస్ (ఎస్ ఎం ఎస్) ద్వారా తెలియజేయాలనీ,

ఆన్‌లైన్ స్టేటస్ అప్‌డేట్: ప్రజావాణి పోర్టల్‌లో అర్జీల స్థితిని ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలన్నారు. ప్రజావాణి ద్వారా ప్రజల సమస్యలు త్వరితగతిన పరిష్కారమయ్యేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజలు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకుని అధికారులకు సహకరించాలని ఈ సందర్భంగా కోరడమైనది.అంతరం వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను వినియోగించాలని కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు,వివిధ విభాగాలకు చెందిన మొత్తం (144) దరఖాస్తులు వచ్చాయని, సంబంధిత విభాగాలకు తగు చర్య నిమిత్తం వెంటనే పంపడం జరిగిందని అన్నారు,అంతకముందు నారాయణపురం గ్రామస్తులు దారావత్ రవి నాయక్, యమునా సర్పంచ్, కైక, వెంకట్ రెడ్డి, సుమన్, శ్రీలత లకు పట్టాదార్ పాస్ బుక్కులు అందజేశారు,ఈ కార్యక్రమంలో అని విభాగాల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి పవన్ కుమార్, సంబంధిత విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

## 1000రోజుల కాంగ్రెస్ పాలన విఫలమై పాదయాత్ర అడిషనల్ కలెక్టర్ ఖీమా నాయక్ కి వినతిపత్రం సమర్పణ





వనపర్తి : కాంగ్రెస్ 1000రోజుల విఫల పాలనపై ఈరోజు అడిషనల్ కలెక్టర్ ఖీమా నాయక్ గారికి బి.ఆర్.ఎస్ శ్రేణులు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమములో వాకిటి.శ్రీధర్,పలుస.రమేష్ గౌడ్,నందిమల్ల.అశోక్,గంధం.పరంజ్యోతి కౌన్సిలర్ శ్రీకర్ గౌడ్ మహిళా నాయకులు కవితా నాయక్, షెమిం బేగం,సీనియర్ నాయకులు ప్రేమ నాథ్ రెడ్డి,బండారు.కృష్ణ,నాగన్నయాదవ్,రఘువర్ధన్ రెడ్డి, దేవర్ల.నరసింహ,మహేశ్వర్ రెడ్డి, గులాం ఖాదర్ ఖాన్,హేమంత్ ముదిరాజ్, సునీల్ వాల్మీకి,సూర్యవంశం.గిరి, జోహెబ్ హుస్సేన్,చిట్యాల. రాము,నందిమల్ల. రమేష్, వెంకట్ సాగర్,మంద.రాము, ఆస్లామ్, శ్రీవాటి.శంకర్, అలీం,తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యేల అక్రమ అరెస్టుపై మెరుపు ధర్నా. బి.ఆర్.ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన వ్యక్తం చేయడానికి బయలుదేరితే రేవంత్ రెడ్డి అక్రమంగా అరెస్టు చేశారని బి.ఆర్.ఎస్ నాయకులు వాకిటి.శ్రీధర్,రమేష్ గౌడ్,నందిమల్ల.అశోక్ కలెక్టరేట్ ముందు మెరుపు ధర్నా నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ అక్రమంగా అరెస్టు చేసిన బి.ఆర్.ఎస్ ఎమ్మెల్యేలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## కరెంటు సమస్యపై కదం తొక్కిన రైతన్నలు

**రైతుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ రాజపేట సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా--రాస్తారోకో**



జడ్చర్ల : వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ రాజపేట, పెద్దతాండా గ్రామపంచాయతీ పరిధిలోని రైతులు సోమవారం రాజపేట సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ కోతల కారణంగా పంటలకు సాగునీరు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. పెద్దతాండా-ఆర్ మాజీ సర్పంచ్ ఎం. జయరాములు నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఆందోళనలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొని విద్యుత్ కోతలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వ్యవసాయానికి నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని, రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎం. జయరాములు నాయక్ మాట్లాడుతూ..... పంటలు కీలక దశలో ఉన్న సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ కోతలతో రైతులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. "రైతు పంటకు నీరు కావాలి.. నీటికి కరెంట్ కావాలి. కరెంట్ కోతలతో రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చూస్తూ ఊరుకోం" అని నాయకులు, రైతులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రాజపేటకు చెందిన నాయకులు, రైతులు కల్కి తిరుపతయ్య, జాన్య నాయక్, నార్య నాయక్, సురేష్, బిచ్యా నాయక్, లోక్య నాయక్, రాహుల్, బక్క బాలరాజు తదితర గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ మహమ్మారితో సిపిఐ జిల్లా కార్యదర్శి సతీమణి మృతి..!!





(సమయం ప్రతినిధి -అమరచింత) : వనపర్తి జిల్లా సిపిఐ కార్యదర్శి విజయరాములు సతీమణి, పంచాయతీ సెక్రెటరీ శ్రీమతి కే జ్యోతి తీవ్ర అనారోగ్యంతో సోమవారం తెల్లవారుజామున మృతి చెందారు. గత నెల రోజుల క్రితం ఆకస్మికంగా క్యాన్సర్ మహమ్మారి ఆమెను ఆవరించగా గత నెల రోజులుగా నిమ్స్ ఆసుపత్రి హైదరాబాద్లో చికిత్స పొందుతూ సోమవారం బుచ్చందారు మృతి చెందారు. అయితే కుటుంబ సభ్యులు తెల్లవారుజాము ఆమె శవాన్ని స్వగృహానికి తరలించెడం తో జిల్లా వ్యాప్తంగా సిపిఐ శ్రేణులతో పాటు కాంగ్రెస్ సిపిఎం, సిపిఐ ఎంఎల్ మాస్ లైవ్, టిఆర్ఎస్ బిజెపి తదితర పార్టీలతో పాటు నాయకులు తరలివచ్చి మృతురాలు శ్రీమతి జ్యోతి కి నివాళులు జోహార్లు అర్పించారు అర్పించారు.భర్తతో పాటు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సోమవారం సాయంత్రం తదుపరి పంచాయతీ సెక్రెటరీ శ్రీమతి జ్యోతి అంత్యక్రియలు అశేష ప్రజానీకం అశ్రునయనాల మధ్య స్మశాన వాటికలో ముగిశాయి. శ్రీమతి జ్యోతికి అంతిమయాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనమునేని సాంబశివరావు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తోపాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ జిల్లాల నాయకులు వివిధ పార్టీల కార్యకర్తలు కాంగ్రెస్బిఆరెస్ సిపిఐ సిపిఎం మాస్ లైన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు. మృతురాలు జ్యోతికి ఇద్దరు ఇద్దరు కుమారులు ఉన్నారు.

# వారసత్వ ఆస్తుల వివాదాలకు చట్టమే పరిష్కారం..
# రెవిన్యూ లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించాలి జిల్లా ఎస్పీ







**వనపర్తి :** వారసత్వ ఆస్తులు, భూములు, స్థలాల విషయంలో అన్నదమ్ములు, ఆస్తి, భూ హక్కుల వివాదాలు సివిల్ స్వభావానికి సంబంధించినవైతే సంబంధిత రెవిన్యూ అధికారులను లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని జిల్లా ఎస్పీ శ్రీమతి లిసునిత రెడ్డి,తెలిపారు. ప్రజలకు సత్వర, పారదర్శక, నిష్పక్షపాత సేవలు అందించడంతో పాటు వారి సమస్యలను చట్టపరమైన పరిధిలో సమర్థవంతంగా పరిష్కరించేందుకు జిల్లా పోలీసుశాఖ నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ప్రజల నుంచి నేరుగా 10 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... వారసత్వ ఆస్తులు, భూములు, స్థలాలు మరియు కుటుంబ ఆస్తుల పంపకాల విషయంలో అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు లేదా ఇతర వారసుల మధ్య ఏర్పడే హక్కులు, వాటాల వివాదాలు ప్రధానంగా సివిల్ స్వభావానికి సంబంధించినవని తెలిపారు. ఇటువంటి వివాదాలకు శాశ్వతమైన పరిష్కారం పొందేందుకు సంబంధిత రెవిన్యూ అధికారులను లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టబద్ధంగా పరిష్కరించుకోవాలని ఆస్తి మనదే అనే భావనతో చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం, ఎదుటివారిని బెదిరించడం, దౌర్జన్యం చేయడం, బలవంతంగా భూమిని ఆక్రమించడం లేదా ఇతరులను భయభ్రాంతులకు గురిచేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావు. చట్టబద్ధమైన మార్గమే శాశ్వత పరిష్కారానికి మార్గం వారసత్వ ఆస్తుల విషయంలో పట్టాలు, హక్కులు, వాటాలు, సరిహద్దులు, వారసత్వ హక్కులు, భూమి పంపకాలు వంటి అంశాలపై వివాదం ఉన్నప్పుడు సంబంధిత రెవిన్యూ అధికారులను సంప్రదించాలని, అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయించి తమ హక్కులను చట్టబద్ధంగా పొందాలని సూచించారు. అయితే భూ లేదా ఆస్తి వివాదాల పేరుతో బెదిరింపులు, దౌర్జన్యాలు, దాడులు, బలవంతపు ఆక్రమణలు, మోసాలు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే పోలీసుశాఖ చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటుందని కుటుంబ సభ్యుల మధ్య ఆస్తి వివాదాలు వ్యక్తిగత కక్షలు, గొడవలు, దాడులు, నేరాలకు దారితీయకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని సమస్యలను చర్చల ద్వారా సాధ్యమైనంతవరకు సామరస్యంగా పరిష్కరించుకోవాలని, పరిష్కారం సాధ్యం కాని సందర్భాల్లో రెవిన్యూ లేదా న్యాయస్థానాన్ని ఆశ్రయించి చట్టబద్ధమైన తీర్పును పొందాలని తెలిపారు. ప్రజావాణి ద్వారా ప్రజలు తమ సమస్యలను నేరుగా పోలీసు అధికారుల దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉందని, ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా పరిశీలించి చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

ప్రజావాణిలో స్వీకరించిన మొత్తం ఫిర్యాదులు – 10

07–భూ/ఆస్తి వివాదాలకు సంబంధించిన ఫిర్యాదులు

01 – భార్యాభర్తల మధ్య వివాదానికి సంబంధించిన ఫిర్యాదు

02 – పరస్పర గొడవలకు సంబంధించిన ఫిర్యాదులు

ప్రజావాణిలో అందిన ప్రతి ఫిర్యాదును సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిశీలించి, బాధితులకు చట్టపరమైన పరిష్కారం అందేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీ సిబ్బందిని ఆదేశించారు.

## సర్వే నెం.455లో ప్రభుత్వ భూమికి రక్షణ కరువు

### ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఆర్డీవోకు రాంపల్లిదాయర గ్రామస్తుల వినతి



వేకువ సమయం : సెప్టెంబర్ 7 కీసర ప్రతినిధి : ప్రభుత్వ భూముల పరిరక్షణలో రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోందని రాంపల్లిదాయర గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కీసర మండలం రాంపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.455లో ఉన్న విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణలకు గురవుతోందని ఆరోపిస్తూ సోమవారం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి, కీసర ఆర్డీవో నల్ల వెంకట్ రెడ్డికి వినతిపత్రాలు అందజేశారు.

గ్రామస్తుల వివరాల ప్రకారం.. సర్వే నెం.455లోని ప్రభుత్వ భూమిని సమగ్రంగా సర్వే చేసి, హద్దులు గుర్తించాలని కోరుతూ 2025 ఏప్రిల్ 21న, అలాగే 2026 జూలై 27న అధికారులకు వినతిపత్రాలు సమర్పించారు. అయినప్పటికీ ఇప్పటివరకు సమస్యపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోలేదని వారు తెలిపారు.

అధికారుల స్పందన లేకపోవడంతో కొంతమంది అనధికార వ్యక్తులు ప్రభుత్వ స్థలంలోకి చొరబడి గదులు, ప్రహరీ గోడలు నిర్మిస్తూ ఆక్రమణలకు పాల్పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తి క్రమంగా అన్యాక్రాంతమయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.

సమగ్ర సర్వేతో హద్దులు నిర్ణయించాలి సర్వే నెం.455లోని భూమిని తక్షణమే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమగ్ర సర్వే నిర్వహించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూమి ఖచ్చితమైన విస్తీర్ణాన్ని గుర్తించి, పక్కాగా హద్దులు ఏర్పాటు చేయడంతో పాటు ఇప్పటికే చేపట్టినట్లు చెబుతున్న అక్రమ నిర్మాణాలపై విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్తులు ఆక్రమణలకు గురైన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందుగానే వాటిని గుర్తించి పరిరక్షించాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి సర్వే నెం.455లోని ప్రభుత్వ భూమిని పూర్తిస్థాయిలో పరిరక్షించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## అక్రమ అరెస్టులతో బిజెపి ఉద్యమాన్ని ఆపలేరు.. బిజెపి మక్తల్ శాఖ

మక్తల్ : బీజేపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం ప్రభుత్వ చేతకాని పనితీరుకు నిదర్శనం. విద్యార్థులకు రావాల్సిన 15 వేల కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకుండా తెలంగాణ విద్యార్థుల జీవితాలను అంధకారంలోకి నెట్టేస్తూ, వారి ఆశలపై నీళ్లు చల్లుతున్న రాష్ట్ర ప్రభుత్వ నిరంకుశ వైఖరికీ పరాకాష్ట 40 లక్షల మంది తెలంగాణ విద్యార్థుల భవిష్యత్తుతో చలగాటమాడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రు కాల్చి వాత పెట్ట సమయం ఆసన్నమైంది.కాంగ్రెస్ ప్రభుత్వం పశువర్ధక శాఖని కేటాయించింది కానీ విద్యాశాఖ మంత్రి కేటాయించకపోవడం కాంగ్రెస్ పార్టీ వైఖరీ నిదర్శనం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం భారీ మొత్తంలో బడ్జెట్ అవసరం అవుతున్నందున, ఆ బాధ్యతను తీసుకునే విద్యాశాఖ మంత్రిని నియమించకుండా తప్పించుకుంటున్న చేతగాని ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోకుండా, విద్యాశాఖకు పూర్తి స్థాయి మంత్రి లేకుండా పాలన సాగించడం బీజేపీ నాయకత్వం చూస్తూ ఊరుకోదు ఇంకెన్నాళ్లు ప్రతిపక్షంలో ఉన్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను ముందస్తు అరెస్టులు చేయిస్తారు? ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీల హామీలను గుర్తు చేయడం ప్రతిపక్ష బాధ్యత విద్యార్థుల సమస్యలపై వారి తరఫున ప్రజా గొంతుకగా మాట్లాడటం మా హక్కు. బీజేపీ విద్యార్థులకు మద్దతుగా నిలిచినందుకే ముందస్తు అక్రమ అరెస్టులు చేయడం ప్రజాస్వామ్యాన్ని అరించడం. పాలించడం చేతకాకపోతే, ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతే ప్రభుత్వం ఏం సమాధానం చెబుతుంది?

ఈ అక్రమ ముందస్తు అరెస్టులకు భయపడే ప్రసక్తే లేదు.విద్యార్థుల కోసం, ఇచ్చిన హామీల అమలు కోసం ఒక్కసారి కాదు... ఎన్నిసార్లు అరెస్టు చేసినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు.




విద్యార్థులకు న్యాయం జరిగే వరకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు మా పోరాటం ఆగదు.పోలీస్ అధికారులు బీజేపీ నాయకులను తెల్లవారుజామున 5 గంటలకే ముందస్తు అరెస్టు చేశారు.బీజేపీ సీనియర్ నాయకులు కన్నస్వామి, కల్లూరి నాగప్ప, మున్సిపల్ కౌన్సిలర్ పీకే నరసింహ, నరేంద్ర టైలర్, బ్యాటరీ రాజు, రాజా గౌడ్, కల్లూరి అంజనేయులు, అనంపల్లి శేఖర్ మేస్త్రి, నర్సింలు మేస్త్రి, కురువ బసవరాజు తదితరులను ముందస్తుగా అరెస్టు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం మా పోరాటం కొనసాగుతుందని అరెస్టులు చేసినా... ఉద్యమాన్ని ఆపలేరు! విద్యార్థులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

## తీజ్ వేడుకల సన్మాన కార్యక్రమం



**మహబూబాబాద్ సెప్టెంబర్ 7 (వేకువ సమయం ప్రతినిధి):** ఈ రోజు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని రామ్చంద్ర పురం లో ఆగస్ట్ నెలలో శ్రావణ మాసంలో పౌర్ణమి లో 18 నుంచి 27 గురువారం వరకు తీజ్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గూగోలోత్ తార బాయి, గుగోలోత్ వందన బాయి అధ్యక్షత వహించి తీజ్ పండుగ ఘనంగా నిర్వహించుకున్నారు. ధర్మిణి యాడి టీం తొమ్మిది రోజుల పాటు ఒక్కక్క రోజు ఒక కార్యక్రమం తో అలాగే రోజు ఆట పాటల నృత్యాలతో నాలుగు కుటుంబాలతో భోజన వ్యవస్థా ను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో ముఖ్య అతిథిగా డి సి సి అధ్యక్షురాలు భూక్యా ఉమా మురళి నాయక్ ఉద్దేశించి మాట్లాడుతూ సేవలాల్ మహారాజ్ తల్లి అయిన ధర్మానియాడి టీం ఎంతో ఘనంగా తీజ్ ఉత్సవాలు చేస్తున్నందుకు ఎంతో గర్వకారంగా ఉందని అన్నారు. అలాగే తొమ్మిది రోజుల పండుగని అందరూ కలిసిమెలిసి సంతోషంగా పూర్తి చేసుకుని ఈరోజు సన్మాన కార్యక్రమం చేస్తున్నందుకు అందరికీ అభినందనలు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ధర్మానియా డి టీం తార, వందన, హైమావతి, రాణి, నిహారిక, అరుణ, పావని, రాణి, భార్గవి, స్వాతి, జ్యోతి, కంసలి, మనీ, సునీత, బిందు, జ్యోతి, సుజాత, రోజా తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలపై దృశప్రవర్తనకు నిరసనగా ఆత్మకూరులో ధర్నా నిరసన

ఆత్మకూరు : నేడు తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా 6 గ్యారెంటీలు 420 హామీలు అమలు చేయాలనీ నల్ల టీషర్ట్స్ ధరించి బి. ఆర్. ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బి. ఆర్. ఎస్ పార్టీ ట్రబుల్ షూటర్ హరీష్ రావు అధ్యక్షతన అసెంబ్లీ కి వెళ్లిన బి. ఆర్. ఎస్ ఎమ్మెల్యే ల పై దురుసుగా ప్రవర్తిస్తూ, మహిళా ఎమ్మెల్యేల పై అసభ్యంగా ప్రవర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా నేడు మక్తల్ మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కి ఆదేశానుసరం ఆత్మకూరు మండల కేంద్రంలో బి. ఆర్. ఎస్ పార్టీ అద్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది... ఇట్టి కార్యక్రమం ఆత్మకూరు మున్సిపల్ మరియు మండల బి ఆర్. ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం బీజేపీ పోరుబాట
## చలో అసెంబ్లీకి వెళ్తున్న కీసర, నాగారం బీజేపీ నేతల అరెస్ట్

వేకువ సమయం సెప్టెంబర్ 7 కీసర ప్రతినిధి : పేద విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్ర మం ఉద్రిక్తతకు దారితీసింది. కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న కీసర మండల బీజేపీ జనరల్ సెక్రెటరీ నల్ల వెంక ట్‌రెడ్డి, నాగారం మాజీ మున్సిపల్ ఛైర్మన్, బీజేపీ రాష్ట్ర నాయకుడు చంద్రారెడ్డిలను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు.బీజేపీ నాయకుల అరెస్ట్‌ను పార్టీ శ్రేణులు తీవ్రంగా ఖండించాయి. విద్యార్థుల విద్యా భ్యాసానికి సంబంధించిన కీలకమైన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని శాంతి యుతంగా డిమాండ్ చేస్తున్న నాయకులను అరెస్ట్ చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. బకాయిలతో విద్యార్థులకు ఇబ్బందులు కళాశాలలకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. ఫీజుల చెల్లింపులు ఆలస్యం కావడంతో విద్యార్థుల చదువులు, తదుపరి విద్యా అవకాశాలపై ప్రభావం పడే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు వెంటనే విడుదల చేయాలి: పేద విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటం ఆడకుండా కళాశాలలకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు.

## టీఐసీసీఐ మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్తగా, ఉమ్మడి వరంగల్ ఏడు జిల్లాల ఇన్‌చార్జిగా డా" ధరంసోతు సీతారాం నాయక్

మహబూబాబాద్ జిల్లా సెప్టెంబర్ 07 (వేకువ సమయం ప్రతినిధి): మహబూబాబాద్: గిరిజన పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈలు, యువత, మహిళా పారిశ్రామికవేత్తలు స్వయం ఉపాధి రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్న ట్రైబల్ ఇండియన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ తెలంగాణ చాప్టర్లో డా ధరంసోతు సీతారాం నాయక్ మాట్లాడుతూ మహబూబాబాద్‌తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏడు జిల్లాల్లో గిరిజన పారిశ్రామికవేత్తలు, ఎంఎస్ఎంఈలు, మహిళా పారిశ్రామికవేత్తలు, యువత కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే ఔత్సాహికులను ప్రోత్సహించడం, వారికి అవసరమైన అవగాహన, మార్గదర్శకత్వం వ్యాపార అవకాశాలతో అనుసంధానం చేయడం తన బాధ్యతల్లో భాగంగా ఉంటుందని డా" సీతారాం నాయక్ తెలిపారు. బ్యాంకులు, ప్రభుత్వ సంస్థలు, పారిశ్రామిక సంస్థలు ఇతర సంబంధిత విభాగాలతో సమన్వయం చేసుకుంటూ వ్యాపార రుణాలు, ఎంఎస్ఎంఈ అభివృద్ధి, ప్రభుత్వ పథకాలు, వెండర్ డెవలప్‌మెంట్, ప్రభుత్వ కొనుగోళ్లు మార్కెట్ అవకాశాలపై పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నేషనల్ ఎస్సీ–ఎస్టీ హబ్, భారత ప్రభుత్వం – సూక్ష్మ, చిన్న మధ్యతరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో, టీఐసీసీఐ – తెలంగాణ చాప్టర్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుంది, అని అన్నారు. ఎంఎస్ఎం ఈ పథకాలు ప్రభుత్వ రాయితీలు, వ్యాపార అభివృద్ధి విస్తరణ, బ్యాంకు రుణాలు ఆర్థిక అవకాశాలు, జీ ఈ ఎం వేదిక ద్వారా ప్రభుత్వ కొనుగోళ్లు, ప్రభుత్వ రంగ సంస్థలకు వెండర్‌గా మారే అవకాశాలు, సాంకేతిక మార్గదర్శకత్వం, శిక్షణ మెంటరింగ్ వంటి అంశాలపై అవగాహన కల్పించనున్నారు.ఇప్పటికే వ్యాపారం చేస్తున్న వారు, కొత్తగా వ్యాపారం ప్రారంభించాలనుకునే వారు, బిజినెస్ లోన్ కోసం ప్రయత్నిస్తున్న వారు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, వ్యాపారులు, సేవా రంగానికి చెందిన వారు ఎస్సీ/ఎస్టీ ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మహబూబాబాద్ జిల్లా నుంచి ఆసక్తి ఉన్న పారిశ్రామికవేత్తలు ముందుగా తమ పేర్లను నమోదు చేసుకుని కార్యక్రమంలో పాల్గొనాలని టీఐసీసీఐ మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్త ఉమ్మడి వరంగల్ ఏడు జిల్లాల ఇన్‌చార్జి డా" ధరంసోతు సీతారాం నాయక్ కోరారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. సంప్రదించడానికి డా" దారంసోతు సీతారాం నాయక్, మహబూబాబాద్ జిల్లా సమన్వయకర్త & ఉమ్మడి వరంగల్ ఏడు జిల్లాల ఇన్‌చార్జి – టీఐసీసీఐ 9908550822.

వేకువ సమయం
మంగళవారం 08 సెప్టెంబర్ 2026

# రైతుల సమస్యలపై బీఆర్‌ఎస్ నిరసన

## ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్





సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7: రైతుల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ వద్ద బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ వెలిగొండ ప్రాజెక్టు ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు 12 టీఎంసీల నీరు తరలిస్తున్నా జిల్లాకు చెందిన సీనియర్ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఇతర ఎమ్మెల్యేలు స్పందించకపోవడం బాధాకరమన్నారు. కనీసం నీటిని తరలించకుండా అడ్డుకునే ప్రయత్నం కూడా చేయడం లేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు పరిధిలో పూర్తయిన రిజర్వాయర్లను కూడా పూర్తిస్థాయిలో నింపడం లేదని, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రైతుల పరిస్థితిని చూసి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నేరుగా పోరాటానికి సిద్ధమవుతున్నారని, త్వరలోనే పాలమూరు ప్రాజెక్టును కేసీఆర్ సందర్శిస్తారని తెలిపారు.రైతులకు రైతుబంధు, పంటల బోనస్, రుణమాఫీ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. రైతులందరికీ ప్రతి పంటకు రైతు భరోసా అందించాలని, ఎరువులను కొరత లేకుండా పంపిణీ చేయాలని, పంటలకు బోనస్, 24 గంటల ఉచిత విద్యుత్ అందించాలని డిమాండ్ చేశారు. రైతు కూలీలకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని కోరారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులకు పీఆర్సీ, టీఏ, డీఏ చెల్లించకపోవడంతో వారు ఆందోళన బాట పట్టారని అన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు స్వేచ్ఛగా వెళ్లి వినతిపత్రాలు అందజేసే పరిస్థితి లేకుండా పోలీసుల ఆంక్షలు విధించడం సరికాదన్నారు.మహిళలకు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం, తులం బంగారం, స్కూటీ అందించాలని, మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఇల్లు లేని ప్రతి కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని కోరారు. అర్హులైన నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి అందించడంతో పాటు ఉద్యోగాలు కల్పించాలని, జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్యా భరోసా కల్పించి, పెండింగ్ ఫీజు బకాయిలను చెల్లించాలని కోరారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, బీడీ కార్మికులకు పెంచిన రూ.4 వేల పెన్షన్ అందించాలని, ఆటో కార్మికులకు ఏడాదికి రూ.12 వేల ఆర్థిక సహాయం అందించాలని పేర్కొన్నారు.బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలు, విద్యార్థులు, యువత, రైతులకు ఇచ్చిన అన్ని డిక్లరేషన్ హామీలను ప్రభుత్వం అమలు చేయాలని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ ప్రతినిధి బృందం కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసింది. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆంజనేయులు, కార్పొరేటర్లు ఈశ్వరయ్య, నవకాంత్, శరత్, సత్యం, మధుమోహన్, సీనియర్ నాయకులు శ్రీనునాయక్, నరేందర్, కుర్వ శ్రీశైలం, నరేష్, జహంగీర్, క్రాంతి, కట్ట రవికిషన్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, సుధాకర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మట్టి గణపతిని ప్రతిష్టిద్దాం..

వేకువ సమయం సెప్టెంబర్ 7 కీసర ప్రతినిధి : పర్యావరణాన్ని పరిరక్షిద్దాం మట్టి గణపతిని ప్రతిష్టిద్దాం.. పర్యావరణాన్ని పరిరక్షిద్దాం పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలపై అవగాహన కార్యక్రమం మేడ్చల్: వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించాలని అధికారులు పిలుపునిచ్చారు. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో భాగంగా మేడ్చల్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ నెల 14వ తేదీన వినాయక చవితి జరగనున్న నేపథ్యంలో మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, ఐఏఎస్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, ఐఏఎస్, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, మేడ్చల్ పర్యావరణ ఇంజనీర్, నోడల్ అధికారి బి. రాజేందర్ తదితర అధికారులు కలిసి పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల వినియోగంపై రూపొందించిన అవగాహన గోడ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పర్యావరణహిత మట్టి వినాయక విగ్రహాల స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ఉద్యోగులు, సిబ్బంది, సాధారణ ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. రసాయనాలు, ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో తయారయ్యే విగ్రహాల వల్ల నీటి వనరులు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున, వాటికి బదులుగా సహజ మట్టితో తయారు చేసిన వినాయక విగ్రహాలను వినియోగించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తోడ్పడవచ్చని అధికారులు సూచించారు. మట్టి విగ్రహాలను ఉపయోగించడం వల్ల వినాయక నిమజ్జనం అనంతరం నీటి వనరులపై కాలుష్య ప్రభావాన్ని తగ్గించవచ్చని తెలిపారు. "మట్టి గణపతిని ప్రతిష్టిద్దాం – పర్యావరణాన్ని పరిరక్షిద్దాం" అనే సందేశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు. ప్రతి కుటుంబం, ప్రతి గణేష్ మండపం పర్యావరణహిత మట్టి విగ్రహాలను వినియోగించేలా ప్రజల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ కార్యాలయం, మేడ్చల్‌కు చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# కళ్లను దానం చేద్దాం.. అంధుల జీవితాల్లో వెలుగులు నింపుదాం





## కలెక్టరేట్‌లో ఘనంగా నేత్ర పరీక్షల శిబిరం

వేకువ సమయం సెప్టెంబర్ 07 కీసర ప్రతినిధి : మేడ్చల్ జిల్లా : జాతీయ నేత్రదాన పక్షోత్సవాల్లో భాగంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఐడిఒసి కలెక్టరేట్‌లోని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో నేత్ర పరీక్షల శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (అర్బన్ లోకల్ బాడీస్) శ్రీ ఫైజాన్ అహ్మద్, ఐ.ఏ.ఎస్. ప్రారంభించారు. కార్యక్రమానికి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డా. కె. ఆనంద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా డా. బరీరా ఫరీద్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ ఎ), సి. మోక్షిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (యూ ఎల్ సి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా డా. కె. ఆనంద్ మాట్లాడుతూ, ప్రజల్లో నేత్ర ఆరోగ్య పరిరక్షణపై అవగాహన పెంపొందించడంతో పాటు, కంటి సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన వైద్య సేవలు అందించడం, నేత్రదానంపై చైతన్యం కల్పించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. నేత్రదానం ద్వారా మరణానంతరం కూడా మరొకరి జీవితంలో వెలుగులు నింపవచ్చని, ప్రతి ఒక్కరూ నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. శిబిరంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో పాటు జిల్లా అధికారులు, వివిధ శాఖల సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని కంటి పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది నేత్ర ఆరోగ్యం, కంటి సంరక్షణపై అవగాహన కల్పించారు.అనంతరం డా. సి. చంద్రకళ, ప్రోగ్రామ్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అధికారులు, సిబ్బందితో నేత్రదానం చేయడానికి ప్రతిజ్ఞ చేయించారు. మరణానంతరం తమ నేత్రాలను దానం చేయడం ద్వారా చూపు లేని వారికి వెలుగును అందించవచ్చని నేత్రదానం ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి మాలతి, జిల్లా రూరల్ డెవలప్‌మెంట్ అధికారి శ్రీ సాంబశివరావు, డా. కౌశిక్, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారితో పాటు వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని నేత్ర పరీక్షలు చేయించుకున్నారు.

# బీజేపీలో చేరిన ఏసీబీ మాజీ అసిస్టెంట్ డైరెక్టర్

శ్రీనివాస్ యాదవ్‌కు కండువా కప్పి ఆహ్వానించిన ఎంపీ డీకే అరుణ



సమయం ప్రతినిధి, మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 7: అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) మాజీ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్ యాదవ్ భారతీయ జనతా పార్టీలో చేరారు. శుక్రవారం ఎంపీ డీకే అరుణ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆమె శ్రీనివాస్ యాదవ్‌తో పాటు శేఖర్, జయవర్ధన్, సుమన్, సాయికిరణ్‌లకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ.. అవినీతి నిరోధక శాఖలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన శ్రీనివాస్ యాదవ్ వంటి అనుభవజ్ఞులు తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు. శ్రీనివాస్ యాదవ్ ఒక అడుగు ముందుకేసి పార్టీలో చేరి క్రియాశీల రాజకీయాల్లోకి రావడం అభినందనీయమన్నారు.అవినీతి రహిత సమాజం కోసం పనిచేస్తాపార్టీలో చేరిన డాక్టర్ శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. దేశం, ధర్మం కోసం పనిచేస్తున్న ఏకైక పార్టీ బీజేపీ అని అన్నారు. అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో పనిచేసేందుకు బీజేపీలో చేరినట్లు తెలిపారు. తాను 30 ఏళ్ల పాటు పోలీసు శాఖలో వివిధ బాధ్యతలు నిర్వహించానని, చివరగా అవినీతి నిరోధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ పొందినట్లు చెప్పారు. ప్రస్తుతం హైకోర్టు న్యాయవాదిగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నట్లు తెలిపారు. తనతో పాటు వైద్యులు, న్యాయవాదులు, పోలీసు శాఖలో పనిచేసిన పలువురు మిత్రులు పార్టీ అభివృద్ధి కోసం బీజేపీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. పార్టీ తనకు ఏ బాధ్యత అప్పగించినా ఒక కార్యకర్తగా నిబద్ధతతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పి. శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ కిరణ్ కుమార్ రెడ్డి, కార్పొరేటర్ జ్యోతి, ఎండోమెంట్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిషోర్ కుమార్, జిల్లా మీడియా సెల్ కన్వీనర్ కే. సతీష్ కుమార్, యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నవీన్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# హామీల అమలుకు ఎడ్లబండ్లతో బీఆర్‌ఎస్ నిరసన

**ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయాలి: ఆల వెంకటేశ్వర్ రెడ్డి**



సమయం ప్రతినిధి, వనపర్తి జిల్లా, సెప్టెంబర్ 7: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మదనపూర్ మండల కేంద్రంలో ఎడ్లబండ్ల ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ వద్ద బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలపై పోలీసులు వ్యవహరించిన తీరును, అరెస్టులను నిరసిస్తూ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఆల ప్రీతిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు నల్ల జెండాలు ధరించి ఆత్మకూరు--వనపర్తి రహదారిపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ హామీల అమలును డిమాండ్ చేస్తూ ఆరు రోజులుగా నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని, ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.ప్రజా సమస్యలను ప్రజాక్షేత్రంతో పాటు అసెంబ్లీలోనూ బీఆర్‌ఎస్ ప్రస్తావిస్తుంటే ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. నల్ల టీషర్టులు ధరించి నిరసన తెలిపే హక్కు ఉందని, ఎలాంటి అభ్యంతరకరమైన భాష లేకపోయినా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను అసెంబ్లీకి రాకుండా అడ్డుకోవడం సరికాదన్నారు. పోలీసుల చర్యల్లో తమ పార్టీ ఎమ్మెల్యేలకు గాయాలయ్యాయని ఆరోపించారు.మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు అమానవీయంగా వ్యవహరించారని ఆరోపిస్తూ ప్రభుత్వ చర్యలను తీవ్రంగా ఖండించారు. పోలీసులను అడ్డుపెట్టుకుని బీఆర్‌ఎస్ గొంతును నొక్కలేరని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, సంక్షేమం, అభివృద్ధి అందించడంలో విఫలమైందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను బీఆర్‌ఎస్ ఎండగడుతుంటే ప్రభుత్వం ఉలిక్కిపడుతోందని, అసెంబ్లీలో బీఆర్‌ఎస్ నిలదీస్తుందనే భయంతోనే అణచివేత చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు ప్రజల పక్షాన బీఆర్‌ఎస్ పోరాటం కొనసాగిస్తుందని ఆల వెంకటేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.

# ప్రజావాణి అర్జీలపై నిర్లక్ష్యం వద్దు.. వెంటనే పరిష్కరించాలి

## అధికారులకు కలెక్టర్ మను చౌదరి కఠిన ఆదేశాలు.. 105 దరఖాస్తుల స్వీకరణ



వేకువ సమయం సెప్టెంబర్ 07 కీసర ప్రతినిధి : మేడ్చల్--మల్కాజిగిరి: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అందిన అర్జీలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా నిబంధనల ప్రకారం వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి, ఐ.ఏ.ఎస్. అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్తో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ, పంచాయతీరాజ్, సివిల్ సప్లైస్, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన మొత్తం 105 దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. ప్రజలు వివిధ ప్రాంతాల నుంచి తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ప్రజావాణికి వస్తున్నందున, వారి సమస్యలకు ప్రాధాన్యతనిచ్చి వేగంగా పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో స్వీకరించిన ప్రతి దరఖాస్తుపై తీసుకున్న చర్యల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో జాప్యం లేకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో మాలతి, లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

OWNED, PRINTED AND PUBLISHED BY KARNAM BHASKAR RAO, PRINTED AT SHREYA SREE PRINTERS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST., T.S. PUBLISHED AT SREEJA SREE PUBLICATONS, H.NO.1-3-129, RAJENDRA NAGAR, MAHABUBNAGAR DIST, T.S, RNI NO: APTEL/2012/47246 EDITOR : KARNAM BHASKAR RAO, Ph: 08542-222814, Cell: 9848997085